ప్రజాశక్తి
ఆదివారం 21 సెప్టెంబర్ 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి





షాపులను తొలగిస్తున్న జివిఎంసి సిబ్బంది

చిరు బతుకులపై మహా ప్రతాపం

- మూడు రోజుల్లో 1759 దుకాణాలు, తోపుడు బండ్లు తొలగింపు
- లబోదిబోమంటున్న వీధివిక్రయదారులు, చిల్లర వర్తకులు
- ఆపరేషన్ లంగ్స్ 2.0 కొనసాగుతుందన్న కమిషనర్
- జివిఎంసి తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం నగరంలోని చిరు వ్యాపారులు, వీధి విక్రయదారులపై కనీస దయ లేకుండా జివిఎంసి అధికారులు విరుచుకుపడుతున్నారు. దుకాణాలను, తోపుడుబండ్లను మూడో రోజైన శనివారమూ తొలగించారు. రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులపై నిర్దాక్షిణ్యంగా వారు దాడికి దిగడంపై అంతటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం ఒక్కరోజే నగరంలో 706 తొలగింపులు జరిగాయి. దీంతో గడిచిన మూడు రోజుల్లో తొలగింపుల సంఖ్య 1759కి చేరింది. ఆక్రమణలు తొలగించేందుకే తాము ఈ పనిచేస్తున్నట్టు కమిషనర్ కేతన్‌గార్గ్ చెప్పుకొచ్చారు. ఆపరేషన్ లంగ్స్ 2.0 కొనసాగుతున్నట్టు తెలిపారు. జోన్ 1 పరిధిలోకి వచ్చే తగరపువలస, భీమిలిలోనూ, జోన్ 2లోని మిథిలాపురి వుడా రోడ్ నుండి గాంధీ విగ్రహం వరకు, తోటగరువు, పెదగదిలి ప్రాంతాలు, మిగిలిన జోన్లలోని గురుద్వారా, పోర్టు స్టేడియం, ఆర్‌టిసి కాంప్లెక్స్, ఊర్వశి జంక్షన్, కంచరపాలెం, గాజువాక, వడ్లపూడి, నెహ్రూ చౌక్ సహా పలు ప్రాంతాల్లో దుకాణాలు, తోపుడు బండ్లను అధికారులు తొలగించారు. చిరు వ్యాపారులు కాళ్లావేళ్లా పడ్డా అధికారులు కనికరించలేదు. (వార్తలు 4లో..)



చిరు వ్యాపారి బడ్డీని క్రేన్ సాయంతో ఎత్తుకెళ్తున్న సిబ్బంది



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

పెట్టుబడుల గమ్యస్థానం విశాఖ

- ఎంఎస్‌ఎంఇలు ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానం విశాఖ అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎంఎస్‌ఎంఇలు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని తెలిపారు. ఇవి ఎగుమతుల్లో దాదాపు 45 శాతం వాటా కలిగి, 11 కోట్ల మందికిపైగా ఉద్యోగాలను కల్పిస్తున్నాయని తెలిపారు. ఫిక్కీ సెంటర్ ఫర్ సస్టైనబిలిటీ లీడర్‌షిప్, విశాఖపట్నం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (విసిసిఐ) సంయుక్తంగా నగరంలోని ఓ హోటల్‌లో పర్యావరణ, సామాజిక పాలన (ఇఎస్‌జి) సూత్రాలు, ఎంఎస్‌ఎంఇల సుస్థిర వృద్ధి అనే అంశంపై అవగాహనా సమావేశం నిర్వహించాయి. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పర్యావరణ, సామాజిక పాలన సూత్రాలను ఎంఎస్‌ఎంఇ కార్యకలాపాల్లో చేర్చడం యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ మార్పు పోటీతత్వాన్ని పెంచడానికి, స్థిరత్వాన్ని సాధించడానికి, ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడానికి చాలా మిగతా 2లో..

ఘనంగా గురజాడ జయంతి

వార్త 3లో..

విశాఖ డెయిరీ పాల రైతుల సమస్యలు పరిష్కరించాలి

వార్త 5లో..

బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకూ పోరాటం

వార్త 8లో..

జిల్లా వ్యాప్తంగా

291 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశాలలో 291 కేసులను పరిష్కరించినట్లు పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, కెఆర్‌ఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టరు ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి తెలిపారు. కుటుంబ భూ సంబంధ తగాదాల పరిష్కారానికి 20వ తేదీన మండలాల ప్రత్యేక అధికారుల అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి సమన్వయ కమిటీలలో 1038 కేసులు విచారణ చేయగా 291 కేసులు పరిష్కరించడం జరిగిందని, 384 కేసులు విచారణలో ఉండగా పరిష్కారం కాని కేసులు 363 కేసులు ఉన్నట్లు ఆమె తెలిపారు. కుటుంబ విలువలకు ప్రాధాన్యత ఇచ్చి ఎఎఎల్‌సిసి కార్యక్రమం ద్వారా భూసంబంధిత కేసులను పరిష్కరించుకోవాలని కక్షిదారులకు విజ్ఞప్తి చేసారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జూలై - 2025 విద్యాసంవత్సరానికిగానూ వివిధ దూర విద్యా కోర్సులతోపాటూ ఆన్లైన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం గడువును ఈ నెల 30వ తేదీ వరకూ పొడిగిస్తున్నట్టు వర్సిటీ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న అన్ని డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు సెప్టెంబర్ 30 వరకూ లభిస్తాయన్నారు. ఈ విద్యా సంవత్సరానికి ఇగ్నో అనేక రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు పెంచే కొత్త కోర్సులను అందిస్తోంది. అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందాల్సి ఉంటుంది. ఇగ్నో వెబ్‌సైట్‌లో ఉన్న అడ్మిషన్ల లింక్ https://ignouadmission.samarth.edu.in ద్వారా మిగతా 2లో..

ఈ-గవర్నెన్స్‌కు ప్రతిష్టాత్మక ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శుభ్రత, భద్రత, పర్యాటక పరంగా ప్రసిద్ధిగాంచిన విశాఖ నగర విశిష్టతను, ప్రాముఖ్యతను మరింత పెంచేలా ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని, అధికారులంతా సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ విభాగం సెక్రటరీ కాటమనేని భాస్కర్ సూచించారు. శనివారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన సమావేశంలో ఈ నెల 22, 23వ తేదీల్లో జరగనున్న ఈ గవర్నెన్స్ జాతీయ సదస్సు నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై సమీక్షించి అధికారులకు పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. దేశం నలుమూలల నుంచి వివిధ రంగాల నిపుణులు, అతిథులు విచ్చేస్తున్నారని, వారంతా హర్షించేలా ఏర్పాట్లు ఉండాలని నిర్దేశించారు. కేంద్ర మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఐటి శాఖ మంత్రి, కేంద్ర, రాష్ట్రాల ఉన్నత స్థాయి అధికారులు సదస్సులో భాగస్వామ్యమవుతారని, ఈ నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సదస్సు జరిగే చోట రిజిస్ట్రేషన్లు సజావుగా జరిగేలా అధిక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. లైజన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అన్ని విషయాలపై అవగాహన పెంచుకొని పని చేయాలని అన్నారు. సమావేశంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ కార్యక్రమ నిర్వహణకు అనుగుణంగా నియమించిన కమిటీలు, ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను పిపిటి ద్వారా వివరించారు.

జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎపి టెక్నాలజీ సర్వీసెస్ విభాగం ఎమ్‌డి సూర్యతేజ, డిసిపి కృష్ణకాంత్ పాటిల్, డిఆర్ఓ భవానీ శంకర్, పలువురు డిప్యూటీ కలెక్టర్లు, భీమిలి ఆర్‌డిఓ సంగీత్ మాధుర్, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న భాస్కర్

మొదటి పేజీ తరువాయి..

పెట్టుబడుల గమ్యస్థానం విశాఖ

ముఖ్యమని పేర్కొన్నారు. జిఎస్‌టిలో తాజాగా తీసుకొచ్చిన సంస్కరణలు ఎంఎస్‌ఎంఇలకు, మధ్యతరగతికి ఉపశమనం కలిగించడంతో పాటు పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహిస్తాయని తెలిపారు. ఇక ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పారిశ్రామిక ప్రోత్సాహక అధికారులు నియమించబడతారని, జిల్లాల స్థాయిలో ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లు ఏర్పడతాయని తెలిపారు. జిసిసి సమ్మిట్, ఇండియా ఇ-గవర్నెన్స్ సమ్మిట్, గ్లోబల్ పార్టనర్‌షిప్ సమ్మిట్ వంటి ప్రధాన అంతర్జాతీయ, జాతీయ కార్యక్రమాలు విశాఖ నగరంలో జరగనున్నాయని తెలిపారు. ఎపిఎంఎస్‌ఎంఇడిసి ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు మాట్లాడుతూ వాతావరణ మార్పులు, పారిశ్రామిక కాలుష్యం, వ్యర్థ జలాల శుద్ధి, పురుగు మందుల అవశేషాలు వంటి పర్యావరణ సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో విసిసిఐ అధ్యక్షులు సుదర్శన స్వామి, కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఇ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శివరాంప్రసాద్, సెంట్రల్ బ్యాంక్ డిజిఎం ఎవి.రమణమూర్తి, జెఎస్‌డబ్ల్యు పారిశ్రామిక పార్క్ బిజినెస్ ఆఫీసర్ రాజారాం పాయ్ పాల్గొన్నారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

అడ్మిషన్లు పొందవచ్చునని ఆయన తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయకేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నిటిలో ప్రవేశాలు పొందే వీలుంది. ఫీజులు కూడా ఆన్లైన్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. ఎపిక చేసిన డిగ్రీ కోర్సుల్లో ఎస్సి, ఎస్టి విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీకూడా కల్పిస్తోంది. మరిన్ని వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ చూడొచ్చు లేదా ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఈమెయిల్ ద్వారా సంప్రదించవచ్చు.

వేతనాలు ఎస్‌బిఐ నుంచే చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో పనిచేస్తున్న 8 వేల మంది కార్మికుల ఖాతాలను ఎస్‌బిఐ నుండి యాక్సెస్ బ్యాంక్‌కు మార్చే ప్రసక్తి లేదని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు టి. నూకరాజు,ఉరికిటిరాజు, గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి స్పష్టం చేశారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల అకౌంట్లను యాక్సెస్ బ్యాంకులోకి మార్చడానికి సిఐటియు వ్యతిరేకం అన్నారు. ఇటీవల జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో యాక్సిస్ బ్యాంక్ అధికారులు, జివిఎంసి అధికారులకు ఈ విషయాన్ని తెలియజేశామన్నారు. ప్రైవేట్ బ్యాంకులు ఇఎస్ఐ, ప్రావిడెంట్ ఫండ్, సంక్షేమ పథకాలు ఎలా చెల్లించగలవని ప్రశ్నించారు. ఇప్పటికే ఆప్కాస్‌తో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రతినెల వందల మంది వేతనాలు పడటం లేదన్నారు. పెన్షన్లు నిలిపివేశారని,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయటం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో కూడా ఎస్‌బిఐ బ్రాంచీలు, ఎటిఎంలు ఉన్నాయని, ఆ నెట్‌వర్క్ యాక్సిస్ బ్యాంకుకు లేదన్నారు. జివిఎంసి అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలన్నారు. ఎస్బిఐ నుండే జీతాలు ఇతర సంక్షేమ పథకాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డెత్ పోస్టులు రిటైర్మెంట్ పోస్టులు వెంటనే ఇవ్వాలని, మినిట్స్‌లో ఒప్పుకున్న ఒప్పందాలు వెంటనే అమలు చేయాలని, లేనియెడల నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ముద్దాడ వరప్రసాద్,జె.ఆర్‌నాయుడు ఆదినారాయణ, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏజ్ కేర్ ఫౌండేషన్ సేవలు అమోఘం

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ : ఏజ్ కేర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని రోటరీ క్లబ్ 3020 డిస్టిక్ గవర్నర్ డాక్టర్ వై.కళ్యాణ్‌చక్రవర్తి కొనియాడారు. గంభీరంలో నూతనంగా నిర్మించిన భవనాన్ని శనివారం ఆయన సందర్శించారు. రోటరీక్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో రూ.22 లక్షల విలువైన వీల్‌ఛైర్లు, ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను ఫౌండేషన్‌కి అందజేశారు. ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ ఎన్.ఎస్.రాజు మాట్లాడుతూ త్వరలో ఏజ్‌కేర్ ఫౌండేషన్ సేవలను పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో చింతా నేతాజీ, సెక్రెటరీ పి. భాస్కర్‌నరేంద్ర జగన్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సిహెచ్ కిషోర్ కుమార్, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ బచ్చు బ్రహ్మానందం పాల్గొన్నారు.

గాజాపై ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలి

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో భాగంగా గాజాపై మరిన్ని దాడులు చేస్తూ, మారణహోమం సాగిస్తోందని, ఈ యుద్ధాన్ని నిలుపుదల చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం డాబాగార్డెన్స్‌లోని బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట, బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ యూనియన్, ఎఐబిడిపిఎ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిఆర్సి హెచ్ వి సాగర్, ఎఐబిడిపిఎ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

నేను, బులుసు ఎస్.ఎస్.ఎస్. కుశాల్, బి-701, బి బ్లాక్, గాయత్రీ టవర్స్, పెదవాల్తేరు, విశాఖపట్నంలో నివాసిని. నేను సెప్టెంబర్ 16, 2025న మాధవధార నుండి పెదవాల్తేరు వెళ్తున్నప్పుడు రూ.5,000 నగదు రెండు ఒరిజినల్ డాక్యుమెంట్స్ నెంబర్లు. 3596/2023, 3598/2023, మరియు ఒక చెక్ బుక్ ఉన్న ఒక బ్రీఫ్ కేస్ పోయింది. ఎవరైనా దొరికినట్లయితే, దయచేసి నన్ను 8008119337 సంప్రదించగలరు. వాటిని తిరిగి ఇచ్చిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.

డాక్యుమెంట్స్ పోయినవి

పద్మనాభుని శ్రీనివాసరావు, వయస్సు 52 సం॥లు, నా ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 650/2013 తాలుకా లింక్ డాక్యుమెంట్ నెంబర్లు 5272/2012, 1324/2011, 1510/1999తో పాటు పద్మనాభుని మణి దీప్ తండ్రి శ్రీనివాసరావు, వయస్సు 26 ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.4973/2023 తాలుకా లింక్ డాక్యుమెంట్ నెంబరు 3496/2025తో పాటు పద్మనాభుని కళ్యాణి భర్త శ్రీనివాసరావు, వయస్సు 47 ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.1428/2015 తాలుకా లింక్ డాక్యుమెంట్ నెం.1569/2008, 1246/1998 నర్సీపట్నం కాంపెక్స్ దగ్గర తేది.01-09-2025న మా ఒరిజినల్ డాక్యుమెంట్స్, లింక్ డాక్యుమెంట్లు పడిపోయినవి. మా డాక్యుమెంట్స్ దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

పద్మనాభుని శ్రీనివాసరావు
కుమారి మెడికల్స్ (హోల్‌సేల్) వినాయక ప్లాజా, నర్సీపట్నం, అనకాపల్లి జిల్లా.
సెల్:9441333132

బుల్‌డోజర్ చర్యలు !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో స్ట్రీట్ వెండార్లపై నగర పాలక సంస్థ 'బుల్‌డోజర్' చర్యలకు దిగిందా అంటే అవుననే చెప్పాలి. తాజాగా వీధివ్యాపారాలపై చోటుచేసుకుంటున్న దాడులతో ఈ విషయం తేటతెల్లమవుతోంది. ఎక్కడ వ్యాపారం చేసుకుని ఉపాధి పొందితే అక్కడే వారికి అవసరమైన సదుపాయాలను కల్పించి వీధి విక్రయదారుల రక్షణకు స్థానిక సంస్థలు కట్టుబడి ఉండాలని గతంలో దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను సైతం నగర పాలకులు లెక్కచేయడం లేదా ? అంటే అవుననే సమాధానమే వస్తుంది. మూడు రోజులుగా విశాఖలో తోపుడుబండ్లు, చిరు వ్యాపారాలు, ఫుడ్ కోర్టులపై జరుగుతున్న దాడులు నేడు చర్చనీయాంశంగా మారాయి. విశాఖ నగరంలో వీధి విక్రయదారులు, చిరువ్యాపారులు పెద్ద సంఖ్యలో సొంత వ్యాపారాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న విషయం తెలిసిందే. వారిపై అధికారులు నిర్దాక్షిణ్యంగా దాడులకు దిగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నగరాభివృద్ధిలో వారు భాగం కాదా ?

విశాఖ అంటేనే అభివృద్ధి నగరం. ఉత్తరాంధ్రలో కీలక ప్రాంతంగా ఇది విలసిల్లుతోంది. గడచిన 25 ఏళ్లుగా ఉత్తరాంధ్ర జిల్లాలైన ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ గ్రామీణ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ కూలీ కుటుంబాలు ఆయా ప్రాంతాల్లో వ్యవసాయం లాభసాటిగా



లేకపోవడం, స్థానికంగా ఉపాధి కొరవడటంతో విశాఖ నగరాన్ని ఆశ్రయిస్తూ వస్తున్నారు. వారిలో ఎక్కువ మంది వీధి వ్యాపారాలు చేసుకుంటూ ఇక్కడే జీవిస్తున్నారు. అభివృద్ధిలో భాగమవుతున్నారు. అటువంటి కుటుంబాలు సుమారు 6 లక్షలకుపైగా ఉంటాయన్నది అధికారిక అంచనా. వారందరిపై అధికారులు నేడు విరుచుకుపడుతున్నారు.

రాజకీయంగానూ పరస్పర విమర్శలు

నగరంలోని జైలురోడ్డులోగల నైట్ ఫుడ్ కోర్టును తొలగించడంతో నగర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. దక్షిణం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతంలో ఫుడ్ కోర్టు ఉంది. జనసేన ఎంఎల్‌ఎ వంశీకృష్ణ శ్రీనివాస్ ఒక్కసారిగా ఈ వ్యవహారంపై భగ్గుమన్నారు. జివిఎంసి కార్పొరేటర్లు అంతా అధ్యయన టూర్‌లో ఉండడం, మరోవైపు అసెంబ్లీ సమావేశాలతో ఎంఎల్‌ఎలు అక్కడ ఇరుక్కుపోవడం చూసి నగర పాలకులు ఈ పనికి దిగారన్న విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి.

నగర పాలక సంస్థ మేయర్ పీలా శ్రీనివాసరావును నేరుగా జనసేన ఎంఎల్‌ఎ వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రశ్నించడం, దీంట్లో ఇంకా టిడిపి పెద్దల హస్తం ఉందంటూ ఆయన ఆరోపించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా ఉంది. ఏళ్లతరబడి నగరంపై ఆధారపడి జీవనం సాగించే వారిపట్ల జివిఎంసి వ్యవహరిస్తున్న తీరుపై మేధావులు, సిపిఎం, వామపక్షాల నాయకులు మండిపడుతున్నారు. ఇలాంటి బుల్‌డోజ్ రాజకీయం తగదంటున్నారు.

అల్జీమర్స్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేటి పరిస్థితుల్లో అల్జీమర్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, కౌన్సెల్ కౌన్సెలింగ్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ నిహాల్ అన్నారు. మతిమరుపు లక్షణాలను తేలికగా చూడొద్దని తెలిపారు. సరైన నివారణ చర్యలు అవసరమని పేర్కొన్నారు. ప్రతిఏటా సెప్టెంబర్ 21న అల్జీమర్స్ వ్యాధి దినంగా జరుపుకుంటున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ సంవత్సరం 'డిమెన్షియా గురించి అడగండి, అల్జీమర్స్ గురించి అడగండి' అన్న నినాదంతో వివిధ కార్యక్రమాలు ప్రపంచ వ్యాప్తంగా చేపడుతున్నారన్నారు. ఆరు పదుల వయసు పైబడిన వారిలో సుమారు పది శాతం మందికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. మెదడులో కొన్ని ప్రోటీన్ల అపసవ్య స్థితి వల్ల నాడీవ్యవస్థలో మార్పులు జరిగి మెదడు నిత్యంచేసే పనులకు అంతరాయం కలుగుతుందన్నారు. మతిమరుపుతో తలెత్తే సమస్యలను తెలియజేశారు. ప్రస్తుతం అల్జీమర్స్ వ్యాధికి మూల కారణాలను వెతికే దిశగా పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. సరైన చికిత్స ఇంకా అందుబాటులో లేనందున నివారణ దిశగా చర్యలు తీసుకోవడం ప్రధానమని పేర్కొన్నారు. బీపీ, మధుమేహం, ఇతర శారీరక వ్యాధులను నిపుణుల ఆధ్వర్యంలో అదుపులో ఉంచుకోవడం అవసరమన్నారు. నిర్దిష్టమైన జీవన శైలి, పౌష్టిక ఆహారం, శారీరక వ్యాయామం ఈ వ్యాధిని నివారించేందుకు దోహద పడతాయన్నారు. అంత్యాక్షరులు, పజిల్స్, చిక్కు సమస్యలు విడదీయడం నిత్యం చేసే విధానాన్ని అవలంబించడం శ్రేయస్కరమన్నారు.


డాక్టర్ నిహాల్

'సముద్ర్ సే సమృద్ధి' ప్రత్యక్ష ప్రసారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సముద్ర్ సే సమృద్ధి కార్యక్రమ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని విశాఖ పోర్టు అథారిటీ ఆధ్వర్యాన శనివారం పలువురు వీక్షించారు. ప్రధాని మోడీ సముద్ర్ సే సమృద్ధి కార్యక్రమంలో భాగంగా గుజరాత్‌లోని భవనగర్ నుంచి రూ.33,600 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. దశాబ్ద కాలంలో సముద్ర రంగ రూపాంతరంపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. స్వచ్ఛత నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశాఖ పోర్టు అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేశారు. వీటన్నింటినీ పోర్టు అథారిటీ అధికారులు వీక్షించారు.

మహారాజశ్రీ యలమంచిలి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 167 / 2016

బిట్వీన్:
పత్సమట్ల వెంకటేశ్వరరాజు . . . వాది
అండ్:
పక్కుర్తి సత్తిబాబు . . . ప్రతివాది

ప్రతివాది:
పక్కుర్తి సత్తిబాబు, తండ్రి ముసిలి, లక్ష్మీపతిరాజుపేట గ్రామం, గుడివాడ, యస్.రాయవరం మండలం, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు దావాలో మీరు ప్రతివాది అయి ఉన్నారు. సదరు దావాలో మీకు సమన్ల/నోటీసు అమలు కొరకు **తే:17-10-2025దిని** వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజున **ఉదయం 10-30 గంటలకు** మీరు స్వయముగా గాని లేదా మీ తరపున న్యాయవాది గారి ద్వారా గాని పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీకోర్టు వారు ఉత్తర్వుల మేరకు)
లాలం వెంకట రామకృష్ణారావు
వాది తరపు న్యాయవాది
యలమంచిలి. యలమంచిలి.
తే:19-09-2025 సెల్: 9440596613

IN THE HON'BLE COURT OF THE II ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT: VISAKHAPATNAM
O.S. 667/2023

Between:
Sri Chiluri Rama Krishna, Rep. by his father & GPA Holder
Prof. Chilukuri Venkata Raghavayya ...Plaintiff
And
Sri N. Venkateswara Rao ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Sri N. Venkateswara Rao,
S/o. Sri N. Muthaiah, Business,
R/at Flat No.301, Eswar Vinayagar Apartments, Behind M.V.R. Mall, CBM Compound, Visakhapatnam-03.

Take notice that the plaintiff filed the suit against you for recovery of the arrears of the rents due to him for the use and occupation of the premises of the plaintiff for damages, interest and costs in the Hon'ble Court. Despite summons sent to your address umpteen times, you successfully avoided to receive the summon which compelled the plaintiff to seek permission from the Hon'ble Court for substitute service of summons. You are here by called upon to appear before the Hon'ble Court on **06-10-2025** at **10:30 A.M.**, either in person or through an Advocate to answer the claim and your failure would entail the Hon'ble Court to set you ex-parte and proceed with the case as per law.

(By Order of the Hon'ble Court)
S. NARAYANA &
I.V. MADHUSUDHANA RAO
Advocates, Visakhapatnam-03
Cell: 9848079684, 9505984590

IN THE HONOURABLE COURT OF THE X ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE AT ANAKAPALLI
E.P. No. 8 of 2025 in AA No. 1154/2013

Between:
M/s. Shriram Finance Limited (Formerly known as Shriram Transport Finance Company Limited), Rep. by its GPA Holder M. Sreenivasa Rao, Pendurthi Branch
... Dhr

And:
1) S.Demudu
2) M.Srinivasarao
..... Jdr's

NOTICE TO JDR:-1 & JDR-2

1. S.Demudu Babu, S/o. Krishnamma, Jodugullu Village, Sabbavaram, Anakapalli District,
2. M.Srinivasa Rao, S/o. Mutyalayya, D.No.7-73, Pedanaidu Palem, Sabbavaram, Anakapalli District.

NOTICE

Please take notice that the above named Decree Holder filed execution petition against you under Order 21 Rule 37 & 38 of C.P.C for arrest of Jdr's 1&2 as he obtained decree against you both i. e. 1) S.Demudu & 2) M.Srinivasarao The matter stands posted to 06-10-2025, as per the orders of the Hon'ble Court, for filing Publication Order 21 Rule 22 Notice to JDR 1 & 2,. so you are hereby informed to appear before the Honourable X Additional District and Sessions Judge at Anakapalli on 06-10-2025 at 10.30 AM either in person or through an advocate, failing which an expate order will be passed against you.

(By order of the Honourable X ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE AT ANAKAPALLI)

BANDI VENKATA NARESH BABU, ADVOCATE,
Door.No.4-218, Ground Floor, Sundar Nagar, Old Dairy Farm, Visakhapatnam -530040, Cell No.9866796969, Email: vnbbandi@gmail.com
VISAKHAPATNAM,
DATE: 20.09.2025

ఘనంగా గురజాడ జయంతి



బిఎన్ఆర్ భవన్‌లో...

ప్రజాశక్తి -యంత్రాంగం

మహాకవి గురజాడ అప్పారావు 163వ జయంతిని పలుచోట్ల శనివారం ఘనంగా నిర్వహించారు.

కరాస : 52వ వార్డు పరిధిలోని జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పిల్లలు 'దేశమును ప్రేమించుమన్నా..' గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరస్వతి, నైని, సునీత, ధనలక్ష్మి, కె.లక్ష్మీదుర్గ, ఆదిలక్ష్మి, కె.హేమలత, లక్ష్మి, శశికళ, జయలక్ష్మి, సుధ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : ఐద్వా ఆధ్వర్యంలో బర్మా క్యాంపులోని పాఠశాలల్లో గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో గురజాడ రచించిన గేయాలపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు సిహెచ్.కమలమ్మ, ప్రధానోపాధ్యాయులు సాయి లక్ష్మి, అధ్యాపకులు, ఐద్వా నాయకులు డి.దేవి, సిహెచ్.హేమ, వెంకటలక్ష్మి, సీత, తనూజ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

కప్పరాడ హైస్కూల్లో గురజాడ అప్పారావు చిత్రపటానికి సాహితీ స్రవంతి నాయకులు భానుమూర్తి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థులతో 'దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా' గేయాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు జె.సులోచన, పి.రమణమ్మ, ఎం.రాధ, ఎల్.శ్యామల, మహలక్ష్మి, ప్రజా నాట్యమండలి నాయకులు సూర్యనారాయణ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ సెంటర్‌లో గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.అనురాధ, సావిత్రి, ఈశ్వరమ్మ, అప్పలరాజు, శారద తదితరులు పాల్గొన్నారు.

బొట్టా నరసింగరావు భవన్‌లో గురజాడ అప్పారావు చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరాటే పిల్లలతో గేయాలాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.అనురాధ, కల్యాణి, శారద, ఆదిలక్ష్మి, సత్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురజాడ అప్పారావు జయంతిని నిర్వహించారు. గురజాడ జీవితం, సాహిత్యం, సంఘ సంస్కరణలు, భాషా సంస్కరణలపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పాలిటెక్నిక్ విద్యార్థినులు పుత్తడిబొమ్మ పూర్ణమ్మ స్కిట్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు శ్రీకాంత్, జెసి.శర్మ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురజాడ వెంకట అప్పారావు జయంతిని నిర్వహించారు. ముందుగా అప్పారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కవిత, సాహిత్యం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠ రావు, వైస్ ప్రిన్సిపాల్ జె గణేష్ ప్రసాద్ రెడ్డి, కళాశాల వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



బర్మాకాలనీలోని జివిఎంసి హైస్కూల్లో....

నేరాలు ఘోరాలు

అదుపు తప్పిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - ఆరిలోవ : జూ సమీపంలోని జాతీయ రహదారిలో విశాఖ నుంచి పార్వతీపురం వెళ్లే ఆర్‌టిసి బస్సు అదుపుతప్పి తుప్పల్లోకి వెళ్లింది ఈ ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఆ సమయంలో బస్సులో ఇద్దరు ప్రయాణికులు మాత్రమే ఉన్నారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదమూ కాలేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- పాయకరావుపేట : పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ వద్ద మెయిన్ రోడ్డుపై శుక్రవారం రాత్రి ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... నక్కపల్లి మండలం, ఉద్దండపురం గ్రామానికి చెందిన బొడ్డా దివాకర్ (36) బైక్‌పై పాయకరావుపేట పట్టణంలోకి వెళ్తూ ప్రభుత్వ హైస్కూల్ వద్ద ముందు వెళ్తున్న మరో బైకును వెనకనుంచి ఢీకొట్టాడు. దివాకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ముందు వెళ్తున్న బైక్ ఉన్న ఒక వ్యక్తికి, చిన్నారికి స్వల గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన ప్రమాదం స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని తుని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బైక్ అతివేగంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్పారు. పాయకరావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేన్సర్ క్యూర్ వార్షిక సమావేశం

ప్రజాశక్తి - ఆరిలోవ : కేన్సర్ క్యూర్ ట్రస్ట్, సంకల్ప్ ట్రస్ట్, మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా 2వ కేన్సర్ క్యూర్ వార్షిక ఆంకాలజీ కాన్ఫరెన్స్ శనివారం రాడిసన్ బ్లూ హోటల్‌లో ప్రారంభమైంది. 'ప్రెసిషన్ ఆంకాలజీ- కేన్సర్ థెరపీ భవిష్యత్తును వ్యక్తిగతంగా రూపొందించడం' అనే అంశంతో రెండు రోజుల సదస్సులో ప్రముఖ ఆంకాలజిస్టులు, పరిశోధకులు, ఆరోగ్య నిపుణులు పాల్గొని రోగికి అనుగుణంగా వ్యక్తిగత వైద్యం అందించడంపై చర్చించనున్నారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఆర్‌డిఒ ఛైర్మన్ జి.సతీష్‌రెడ్డి, గౌరవ అతిథులుగా ఐఎఫ్ఎస్ అధికారి నీరజ.ఎ, జివిపి మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ సుబ్బారావు హాజరయ్యారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రఘునాథ్‌రావు.డి, డాక్టర్ సుమన్ చక్రబోర్తి ముఖ్య ఉపన్యాసాలు చేశారు. సమాజంలో కేన్సర్ సంరక్షణకు విశేష కృషిచేసిన వ్యక్తులు, సంస్థలను ఈ కాన్ఫరెన్స్‌లో ఘనంగా సత్కరించారు. కేన్సర్ క్యూర్ ట్రస్ట్ ఛైర్మన్, కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ రమావత్ దేవ్ మాట్లాడుతూ, 'ప్రెసిషన్ ఆంకాలజీ భవిష్యత్తు కాదు, ఇది వర్తమానం, మనం కలిసికట్టుగా రోగి సంరక్షణను మార్చగలం' అని అన్నారు. రెండు రోజుల ఈ కాన్ఫరెన్స్‌లో శాస్త్రీయ సమావేశాలు, ఇంటరాక్టివ్ వర్క్‌షాప్, ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశీయ, అంతర్జాతీయ ఆంకాలజిస్టులు, శస్త్రచికిత్స నిపుణులు, రేడియాలజిస్టులు, పరిశోధకులు పాల్గొన్నారు.

రహదారి పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాల నుంచి అన్నవరం గ్రామం వరకు రూ.6.18 కోట్లతో దాదాపు 8 కిలో మీటర్ల మేర పునర్నిర్మించనున్న రహదారి నిర్మాణ పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ జాన్ సుధాకర్, ఇఇ సాంబశివరావు, ఎఇ అన్నపూర్ణ, దీవీస్ సంస్థ జిఎం వైఎస్.కోటేశ్వరరావు, డిజిఎం జగదీష్, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, ఎఎంసి ఛైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు, సరగడ అప్పారావు, చిక్కాల విజయ్‌బాబు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

110 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని వెల్లంకిలో వృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, వృక్ష ఫౌండేషన్ అధ్యక్షులు కాకర సురేష్‌కుమార్, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి సత్యవతి, నేత్ర వైద్య నిపుణులు దేవి ప్రారంభించారు. అనంతరం 110 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 20 మందిని కేటరాక్ట్ శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. అదనంగా ముగ్గురికి కంటి పొర సమస్యలకు, ఒకరిని కంటి నర సమస్యకు, నలుగురిని గ్లకోమాకు, ఒక చిన్నారిని కంటి సమస్యలకు రిఫర్ చేశారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంప్ కో-ఆర్డినేటర్ వై.రాజు, ఆర్ఎంపి వైద్యులు పి.కనకరావు, ఫౌండేషన్ సభ్యులు తాటిచెట్ల జగదీష్, పిల్లి సాయిరెడ్డి, గుబ్బల పూర్ణచంద్ర, చుక్క నాయుడు, శంకర్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అవంతిలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి -తగరపువలస : హెచ్ఎంఐఎస్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ విభాగాల సంయుక్తాధ్వర్యంలో ఈ నెల 2న ప్రారంభమైన వర్క్ షాప్ శనివారంతో ముగిసింది. సరికొత్త ఆలోచనలకు, నూతన ఒరవడులకు, నైపుణ్యానికి ఈ వర్క్ షాప్ వేదికగా నిలిచిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. రిసోర్స్ పర్సన్‌గా ప్రయివేట్ సంస్థ సిఇఒ హీరా వర్ధినేష్, సమన్వయ కర్తలుగా పి.శ్రీలక్ష్మి, సంగీత మిశ్రా, పి.శిరీష వ్యవహరించారు.

పలుచోట్ల పోషణ మాసం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని వికె.పాలెం, బాందేవపురం, తిమ్మాపురం, విజయరాంపురం గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పోషక విలువలతో కూడిన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాల గురించి వివరించారు. వీటి ద్వారా తయారుచేసుకున్న తినుబండారాలతో బాలింతలు, చంటి పిల్లలకు మంచి పోషకాలు అందుతాయని వివరించారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-మధురవాడ : కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరానికి 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్. చంద్రశేఖర్ తెలిపారు. 9వ తరగతిలో ప్రవేశానికి 2025-26లో 8వ తరగతి చదువుతూ, 2011 మే 1వ తేదీ నుంచి 2013 జులై 31వ తేదీ మధ్య మధ్య జన్మించి ఉండాలని, 11వ తరగతిలో ప్రవేశానికి 2009 జూన్ 1 నుంచి 2011 జులై 31వ తేదీ మధ్య పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. చదువుతున్న పాఠశాల, నివసిస్తున్న జిల్లా ఒక్కటే అయితే జిల్లాస్థాయి మెరిట్‌లో పరిగణిస్తామని తెలిపారు. పరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న ఉంటుందని, ఈ నెల 23వ తేదీ లోపు www.navodaya.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అపోలోలో బోన్ మ్యారోపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచ బోన్ మ్యారో దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరిలోవ హెల్త్‌సిటీ, అపోలో కేన్సర్ సెంటర్‌లో ధాత్రి బ్లడ్ స్టెమ్ సెల్ రిజిస్ట్రీ సహకారంతో శనివారం బోన్ మ్యారో చికిత్సపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పటి వరకు తమ ఆసుపత్రిలో బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్స పొంది కోలుకున్న వారు, వారికి స్టెమ్స్ సెల్ దానం చేసిన దాతలు పాల్గొన్నారు. కేన్సర్, ఇతర క్లిష్టమైన వ్యాధులతో పోరాడుతున్న రోగులకు ఆశను కలిగించేందుకు, స్టెమ్ సెల్ దానం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయజేసారు. వీటితో పాటు ఒక విజయవంతమైన ట్రాన్స్ ప్లాంట్ గ్రహీత, స్టెమ్స్ సెల్ దాత మధ్య సంభాషణ, వారి అనుభవాలు, ధైర్యాన్ని, కరుణను, కోలుకున్న తీరును పరస్పరం పంచుకున్నారు. ఈ సందర్భంగా కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ డాక్టర్ రాకేష్ రెడ్డి బోయా, డాక్టర్ ప్రదీప్.వి, డాక్టర్ రవీంద్ర కుమార్, డాక్టర్ వేణి ప్రసన్న మాట్లాడుతూ, 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు స్వచ్ఛంద స్టెమ్ సెల్ దాతలుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంతోషి మాధురి, డాక్టర్ కృష్ణప్రసాద్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జె.రామచంద్ర పాల్గొన్నారు.

మధురవాడ పిఎసిఎస్ మహాజన సభ

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ పిఎసిఎస్ 66వ మహాజన సభను శనివారం ఛైర్మన్ పోతిన ప్రసాద్ అధ్యక్షతన సొసైటీ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, 2025 మార్చి 31వ తేది నాటికి మొత్తం సభ్యులు 3083 మంది ఉన్నారని తెలిపారు. రూ.300 షేరుధనం గల సభ్యులు 543 మంది, అసోసియేట్ సభ్యులు 1124 మంది, వీరిలో ఎ క్లాస్ సభ్యులు 301 మంది, అసోసియేట్ సభ్యులు 712 మంది ఆన్ లైన్‌లో నమోదు చేసుకున్నట్లు వివరించారు. మిగిలిన సభ్యులలో మరణించినవారు, కెవైసి చేసుకోనివారు ఉన్నారని, వీరి షేరుధనం రూ.8.24 లక్షలు ఉందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఆడిట్ రిపోర్టు ఇంకా రావలసి ఉందని తెలిపారు. గడిచిన 2023-24 ఆర్థిక సంవత్సరం సొసైటీ రూ.38.60 లక్షలు లాభాలు ఆర్జించిదని తెలిపారు. 2025 మార్చి 31 నాటికి రూ.4 కోట్ల 11 లక్షల 38 వేలు డిపాజిట్లు కలిగి ఉందని, రూ.3 కోట్ల, 28 లక్షల 24 వేలు రుణాలు మంజూరు చేసామని వివరించారు. మెట్రో రైలు ప్రాజెక్టు కోసం సంఘం స్థలం కొంత తీసుకుంటామని నోటీసు వచ్చిందని, నష్టపరిహారం ఎంత వస్తుందో స్పష్టత రాగానే సభ్యులందరికీ తెలియజేస్తామని చెప్పారు. సంఘం భవనం మరమ్మతులు చేయించాలని ప్రవేశ పెట్టిన ప్రతిపాదనను మహాజన సభ ఆమోదం తెలిపింది. సొసైటీ డైరెక్టర్లు పోతిన మీనాక్షి, బైపిళ్ల పైడిరాజు, సొసైటీ సిఇఒ అప్పలరాజు, డిసిసిబి మధురవాడ శాఖ మేనేజర్ జి.వెంకటఅప్పారావు, ఎడ్యుకేషన్ అధికారి రమేష్ బాబు, మరుపిళ్ల పైడిరాజు, మొల్లి లక్ష్మణరావు, నాగోతి సూర్యప్రకాష్, సియ్యాద్రి పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పివి వ్యాక్సిన్‌పై అవగాహన

ప్రజాశక్తి- పద్మనాభం : రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ఆధ్వర్యంలో హెచ్‌పివి వ్యాక్సిన్‌పై కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఆవరణలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ ఫ్యాకల్టీ, హెచ్‌పివి వ్యాక్సినేషన్ శిక్షకులు డాక్టర్ అల్లు నిహారిక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. గర్భాశయ ముఖద్వారా కేన్సర్ ద్వారా దేశంలో ప్రతి గంటకు 9 మంది చనిపోతున్నారని వివరించారు. దేశంలో ప్రతి ఐదుగురిలో ఒకరికి ఈ వ్యాధి ఉందని డబ్ల్యుహెచ్ఒ లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. దీని నివారణకు 9 నుంచి 15 సంవత్సరాల వయసుగల బాలికలకు ఆరు నెలల లోపల రెండుసార్లు హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించాలని చెప్పారు. 15 నుంచి 26 సంవత్సరాలు మధ్య గలవారికి మూడు డోసులు ఇవ్వాలని తెలిపారు. మహిళలు దీనిపై అవగాహన పెంచుకొని ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూపాకుల రవికుమార్, టి.నాగమణి, కె.గ్రేస్‌లిల్లీ, రమణమ్మ, మణి వర్ధనం తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో ఈ నెల 22 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు దేవి నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించడానికి పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిపి కె.రాంబాబు తెలిపారు. సర్పంచ్ సన్యాసమ్మ ఆధ్వర్యంలో పద్మనాభం నుండి సింహాచలం పోవు రోడ్డు మార్గంలో ఉన్న సాగరదుర్గ ఆలయంలో దేవి నవరాత్రులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ నిర్వాహకులు సత్యనారాయణ తెలిపారు.

ట్రాఫిక్‌పై గ్యాస్ కార్మికులకు అవగాహన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి గంగిరెడ్ల కాలనీలో ఉన్న హెచ్‌పి గ్యాస్ గోడౌన్ వద్ద గ్యాస్ డెలివరీ బోయ్స్‌కు శనివారం ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ సురేష్ మాట్లాడుతూ, బరువైన సిలిండర్లతో వెళ్లినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధాన రహదారిలో వెళ్లేటప్పుడు తప్పనిసరిగా పాటించవలసిన నిబంధనలను తెలిపారు. హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో పనిచేయాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులకు సంస్థ సీఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి దిశానిర్దేశం చేశారు. ఏపీఈపీడీసీఎల్ సాగర్‌నగర్ ట్రైనింగ్ సెంటర్‌లో ఐఐఎం విశాఖపట్నం సహకారంతో మూడు రోజుల పాటు 'ఆర్గనైజేషనల్ బిహేవియర్. మేనేజింగ్ పీపుల్' అనే అంశంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సీఎండి మాట్లాడుతూ, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు అధికారుల నైపుణ్యాలను పెంపొందించి, సిబ్బందితో పాటు వినియోగదారులకు మరింత చేరువ కావడానికి దోహదం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన చీఫ్ జనరల్ మేనేజర్లు, జనరల్ మేనేజర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సీఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫైనాన్స్, హెచ్ఆర్‌డి డైరెక్టర్ డి.చంద్రం, ఐఐఎం ప్రోగ్రామ్ డైరెక్టర్లు ప్రొఫెసర్ హ్యాపీ పాల్, ప్రొఫెసర్ అనుపమ శర్మ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ప్రిన్సిపల్ శంకరరావు

26 నుంచి చౌక్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం పాలవలస అసెంట్ పాఠశాలలో 16వ జూనియర్ నేషనల్ చౌక్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరగనున్నాయని అసెంట్ కళాశాల ప్రిన్సిపాల్ కొలగాని శంకరరావు శనివారం తెలిపారు. దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాల నుండి ఆటగాళ్లు, రిఫరీలు, నిర్వాహకులు కలిపి దాదాపు 700 మంది పాల్గొనబోతున్నారని వివరించారు. పోటీల కోసం పాఠశాల క్రీడా మైదానాన్ని సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రారంభ వేడుకలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నాయకులు కోరాడ రాజబాబు, భీమిలి జనసేన ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల హాజరుకానున్నారని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చే క్రీడాకారులకు ఈ నెల 21వ తేదీ నుంచే శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, వారికి వసతి సౌకర్యాలను కూడా అసెంట్ పాఠశాలే కల్పించనుందని ప్రిన్సిపాల్ కొలగాని శంకరరావు, పాఠశాల డైరెక్టర్ పాలవలస బంగారునాయుడు తెలిపారు.

సైన్స్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని 44 ఉన్నత పాఠశాలలకు దివీస్ యాజమాన్యం సమకూర్చిన సైన్స్ కిట్లను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా దివీస్ జనరల్ మేనేజర్ వైఎస్.కోటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులకు ఈ సైన్స్ కిట్ అందించడం సంతోషంగా ఉందన్నారు. దివీస్ ఎం.డి. మురళి కె.ప్రసాద్ విద్యాభివృద్ధికి సహకరించడానికి సిద్ధంగా ఉంటారని చెప్పారు. దివీస్ డిజిఎం జగదీష్ మాట్లాడుతూ, ఈ కిట్లు విద్యార్థులు అన్ని రకాల ప్రయోగాలు చేయడానికి ఉపయోగపడే విధంగా తయారుచేసినట్లు వివరించారు.

భీమిలి ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా మంచి భవిష్యత్తు సాధ్యమన్నారు. దివీస్ సంస్థ సామాజిక బాధ్యతగా రూ.79.20 లక్షల విలువైన సైన్స్ కిట్లు అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, పాఠశాల విద్య కమిటీ చైర్మన్ బి.లక్ష్మి, ఎంపిపి మజ్జి శారదాప్రియాంక, నాయకులు బమ్మిడి ఉమ, గనిరెడ్డి సోంబాబు, తాత్రాజు ఆదినారాయణ, బిఆర్‌బి నాయుడు, దివీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతల నడుమ తొలగింపులు

◆ లబోదిబోమంటున్న వీధివిక్రయదారులు, చిల్లర వర్తకులు ◆ జివిఎంసి తీరుపై విమర్శలు



తగరపువలసలో క్రేన్‌తో తొలగిస్తున్న బడ్డీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అండర్ పాస్ సమీపంలో వై.జంక్షన్, ఈఎస్ఐ ఆసుపత్రి ప్రహరీకి అనుకుని ఉన్న దుకాణాలను శనివారం జివిఎంసి ఒకటో జోన్ అధికారులు తొలగించారు. క్రేన్ సాయంతో దుకాణాలను ఉన్న పళంగా తొలగించేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలను బాధితులు అడ్డుకున్నారు. ప్రొక్లెయినర్‌కు అడ్డంగా నిలిచి అధికారుల తీరును ప్రతిఘటించారు. సిఐ బి.తిరుమలరావు పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, పట్టణ ప్రణాళికా విభాగం ఎసిపి రామకృష్ణ సమక్షంలో దుకాణాలను తొలగించారు.

ఈ సందర్భంగా సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ, ఏళ్ల తరబడి చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుని దాదాపు 60 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, వీరిని ఇలా రోడ్డున పడేయడం సమంజసం కాదన్నారు. సిఐటియు నాయకులు నీలాతి రాము, వైసిపి నాయకులు ఎస్.కరుణాకరరెడ్డి పాల్గొన్నారు.

సీతమ్మధార : సీతమ్మధారలోని స్వేఫ్‌ఎస్ స్కూల్ ప్రాంతం, హెచ్‌బి.కాలనీ పరిసర ప్రాంతాల్లో పట్టణ ప్రణాళిక అధికారులు తోపుడుబండ్లు, బడ్డీలను తొలగించారు. దీంతో వ్యాపారస్తులు ఆందోళన చేపట్టారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు సంఘటనా స్థలానికి చేరుకొని వ్యాపారస్తులకు మద్దతుగా నిలిచారు. ఉన్నపళంగా దుకాణాలను తొలగిస్తే వారు ఎలా బతకాలని అధికారులను ప్రశ్నించారు. వ్యాపారస్తులు కూడా అధికారులను నిలదీయడంతో తీవ్ర ఆందోళన నెలకొంది.

ఆరిలోవ : నడక మార్గాల్లు, రహదారి మార్జిన్లలో ఉన్న స్టాల్స్, బడ్డీల తొలగింపు కార్యక్రమాన్ని జివిఎంసి పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది శనివారం కూడా కొనసాగించారు. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఎసిపి శాస్త్రి ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ కూడలి నుంచి బాలాజీనగర్ వైపు వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న స్టాళ్లను, బడ్డీలను, దుకాణాలను తొలగించారు. చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వారి దుకాణాల తొలగింపులను జివిఎంసి టౌన్‌ప్లానింగ్ ఆపాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఆరిలోవ అంబేద్కర్ కూడలి వద్ద సిపిఐ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్‌కె.రెహ్మాన్, దేవుడమ్మ, కె.లక్ష్మణరావు, కాసుబాబు, సందీప్, ఎ.రవి, బి.పుష్పలత పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల ఆందోళనలు

మధురవాడ : తోపుడు బండ్లు, చిల్లర వర్తకులను యథావిధిగా వ్యాపారం చేసుకోనివ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మిథిలాపురి వుడా కాలనీ రోడ్డు నుండి కారు షెడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కారు షెడ్ వద్ద మానవహారం నిర్మించేందుకు ప్రయత్నించగా పిఎం.పాలెం పోలీసులు అడ్డుకున్నారు. సిఐటియు నాయకులు పి.రాజుకుమార్, డిజిఅప్పలరాజును అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో తోపుడు బండ్ల కార్మికులు పోలీసులను నిలదీశారు. అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని రోడ్డుపై బైఠాయించారు. అనంతరం అరెస్టు చేసిన నాయకులను విడుదల చేశారు. ఈ సందర్భంగా తోపుడు బళ్ల సంఘాల నాయకులు మాట్లాడుతూ, తమ ఉపాధిని కాపాడుకునేందుకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పిఎం.పాలెం, మిథిలాపురి వుడా కాలనీ, కొమ్మాది, మధురవాడ ప్రాంత చిరు వర్తకులు పాల్గొన్నారు.



మధురవాడలో ర్యాలీ చేస్తున్న చిరు వ్యాపారులు

వేపగుంట : తోపుడు బండ్లు తొలగింపు వెంటనే ఆపాలని గోపాలపట్నం తోపుడుబండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో గోపాలపట్నం నుండి వేపగుంట వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నాయకులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా రోడ్లపై వ్యాపారం చేసుకుంటున్న తోపుడు బండ్ల కార్మికులకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా తొలగించడం అన్యాయమన్నారు. సిఐటియు గోపాలపట్నం అధ్యక్షులు బి. వెంకటరావు మాట్లాడుతూ, వచ్చిన ప్రభుత్వాలు అన్నీ తోపుడు బండ్ల కార్మికులకు హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తామని మాటలు చెబుతున్నాయి తప్ప అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపట్నం తోపుడు బండ్ల సంఘం కార్యదర్శి జి.మురళి, సిఐటియు నాయకులు జక్కన్న, అనురాధ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గోపాలపట్నం నుంచి వేపగుంట వరకు ర్యాలీగా వెళ్లిన చిరు వ్యాపారులు

22న జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వీధి విక్రయదారులు, చిరు వ్యాపారులపై జివిఎంసి అధికారులు చేస్తున్న దాడులు వెంటనే ఆపాలని, వారి ఉపాధికి రక్షణ కల్పించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దుకాణాలు, తోపుడుబండ్ల తొలగింపు చర్యలతో నగరమంతటా జివిఎంసి అధికారులు భయానక వాతావరణం సృష్టించారన్నారు. వందలాది మంది పోలీసులను, భారీ క్రేన్లను, జెసిబిలను తీసుకొచ్చి తొలగింపు చర్యలు చేపట్టారన్నారు. ముందస్తు నోటీసులు ఎవ్వరికీ ఇవ్వకుండా తొలగింపులు చేపట్టడం అన్యాయమని పేర్కొన్నారు. జివిఎంసి కమిషనర్ ఏకపక్ష నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. తొలగించిన వీధి విక్రయదారులు, తోపుడుబండ్ల కార్మికులందరూ సోమవారం ఉదయం 10 గంటలకు జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు.

తొలగింపు చర్యలను నిలుపుదల చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఉపాధ్యక్షులు కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.

యడ్ల వీరభద్రరావు ధన్యజీవి

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి -గాజువాక : సిఐటియు సీనియర్ నాయకులు కీర్తిశేషులు యడ్ల వీరభద్రరావు ధన్యజీవి అని పలువురు వక్తలు కొనియాడారు. గాజువాక ఆటోనగర్ కాలనీ అసోసియేషన్ ఆఫీసులో శనివారం వీరభద్రరావు సంస్మరణ సభ నిర్వహించారు. వీరభద్రరావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ, సమాజం కోసం అన్ని అంశాలను అధ్యయనం చేసిన వ్యక్తి వీరభద్రరావు అన్నారు. ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారని తెలిపారు. ట్రేడ్ యూనియన్‌లో ఆయన ఒక రోల్ మోడల్‌గా నిలిచినట్లు పేర్కొన్నారు. డాక్ యార్డులో ఉద్యోగం చేస్తూ, చివరి వరకు సమాజం కోసం ఆలోచించారని తెలిపారు. ఆయన ఆశయం కోసం కుటుంబ సభ్యులు కూడా నిలబడటం గొప్ప విషయం అన్నారు. ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారని, దాన్ని నిలబెట్టడానికి కృషి చేయాలని కోరారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ, వీరభద్రరావుతో పాటు, ఆయన కుటుంబ సభ్యులు కూడా సమాజ సేవలో ఉండడం అభినందించదగ్గ విషయం అన్నారు. బతికున్నంత వరకు సమాజానికి ఉపయోగపడటమే కాకుండా, చనిపోయిన తర్వాత కూడా ఉపయోగపడాలని వీరభద్రరావు భౌతికకాయాన్ని కెజిహెచ్‌కు దానం చేశారని తెలిపారు. ఉద్యోగం చేస్తూనే నివాస ప్రాంతంలో పనిచేసేవారని చెప్పారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, వీరభద్రరావు ప్రభుత్వ రక్షణ రంగంలో ఉద్యోగం చేస్తూ సిఐటియు అభివృద్ధికి కృషి చేశారన్నారు. భావితరాలకు ఈ కంపెనీ నిలబడాలని ఎన్నో కార్యక్రమాలు చేసినప్పుడు నిర్బంధాల్లో కూడా వెనక్కి తగ్గకుండా నిలబడి పనిచేశారని తెలిపారు. విధులు ముగించుకొని వచ్చాక ఆటోనగర్ నివాస ప్రాంతాల్లో స్థానిక ప్రజల సమస్యలపై పనిచేశారన్నారు. రెడ్డి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి, ఆయన కుటుంబ సభ్యులు కమల, రమేష్, అరుణ, రాజేష్, సిపిఎం సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న కె.లోకనాథం

విశాఖ డెయిరీ పాల రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ డెయిరీకి పాలు సరఫరా చేసే రైతుల సమస్యలను డెయిరీ యాజమాన్యం పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ, పాల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఈనెల 24న విశాఖ డెయిరీ సర్వసభ్య సమావేశం నేపథ్యంలో చలో విశాఖ డెయిరీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ డెయిరీ జనరల్ బాడీ సెప్టెంబర్ 24న జరగనున్న నేపథ్యంలో పాల రైతుల సమస్యలు లీటరుకు పది రూపాయలు పెంచాలని, డెయిరీలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపి దోషులను శిక్షించాలని, డెయిరీ ఆస్తులను కాపాడాలని, ప్రతి మూడు నెలలకు బోనస్ ఇవ్వాలని, పశువులకు ఉచిత బీమా, మందులు దానాపై 70శాతం సబ్సిడీతో ఇవ్వాలనే డిమాండ్ చేశారు. పై డిమాండ్లపై పెద్ద ఎత్తున రైతులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. డెయిరీ జనరల్ బాడీ వద్ద రైతులు పై డిమాండ్స్ పై నినదించాలని కోరారు. కార్యక్రమంలో పాల రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతు సంఘం నాయకులు గండి నాయన బాబు, నాగిరెడ్డి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం నాయకులు ఎస్ బ్రహ్మాజీ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

పోస్టల్ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అనకాపల్లి పోస్టల్ సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని కొండకర్ల గ్రామంలో శనివారం అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ చుక్కా శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఇంటింటా పోస్టల్ సేవలు అనేదానిపై అవగాహన సదస్సు నిర్వహించారు. తపాలా శాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి పోస్ట్ ఆఫీస్ పొదుపు పథకాలు గురించి వివరించారు. అనంతరం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కొండకర్ల ఆవలో పర్యావరణ పరిరక్షణకు రెండు మొక్కలను నాటారు. ఆవ సమీపంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని శ్రమదానంతో సిమెంట్ రోడ్డుపై వ్యర్థపదార్థాలను ప్లాస్టిక్ కవర్లను తుడిచి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు అనుకూలంగా చిన్న మొత్తాలలో పొదుపు చేసుకోటానికి ప్రభుత్వం పథకాలను ప్రవేశ పెట్టిందని చెప్పారు. సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్, సేవింగ్స్ , కాలపరిమితి పథకాలను, ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ అకౌంట్లు గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో అనకాపల్లి పోస్టల్ డివిజన్ డవలప్మెంట్ అధికారి వై బి పలసరావు, కోట్ని శివ, భవాని శంకర్, చిరంజీవులు, సీకల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్, రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో శనివారం అథ్లెటిక్ పోటీలను కళాశాల యాజమాన్యం అధ్యక్షులు శ్రీధరాల కృష్ణ పేర్రాజు, కరస్పాండెంట్ పెంటకోట వెంకటరామారావు(శ్రీను), ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయబాబు, డిఐఈఓ ఎం.వినోద్ బాబు ప్రారంభించారు. అందులో భాగంగా 100మీటర్లు, 200, 400వీ, 800, 1500మీటర్లు, 3 కెఎం, 4 కెఎం, 6 కెఎం, షాట్ పుట్, డిస్కస్ త్రో, జావలిన్ త్రో, లాంగ్ జంప్, త్రిపుల్ జంప్, హైజంప్, రగ్బీ పోటీలు అండర్-19 బాల బాలికలకు నిర్వహించారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని విశాఖ జిల్లా అథ్లెటిక్ అండర్-19 టీంకు ఎంపిక చేయడం జరిగిందని, వీరు ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ విఎ. పుష్పలత, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీలక్ష్మి, ఉమ, సాగర్, తరుణ్, ప్రసాద్, సావిత్రి, డాక్టర్ కె. వి. ఎస్ .నాయుడు, కే.శత్రుఘ్న, వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్ కుమార్, సూపరింటెండెంట్ పి.అనురాధ, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు వాసిరెడ్డి బాలకష్ణ, కె రవీంద్ర, యు.కృష్ణ కిషోర్, పివి. సుధాకర్, ఏ. నూకయ్య నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్లాస్టిక్ రహిత పాఠశాలలో భాగంగా శనివారం మామిడిపాలెం జడ్పీ హైస్కూల్‌లో సుమారు 600 మంది విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్‌ను లక్ష్మీనారాయణ క్వారీ సంస్థ ఉచితంగా పంపిణీ చేసింది. ఈ సందర్భంగా జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ మాట్లాడుతూ లక్ష్మీనారాయణ క్వారీ సంస్థను, దాతలను తీసుకొచ్చిన మామిడిపాలెం సర్పంచ్ పూడి పరదేశినాయుడుని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి పరదేశి నాయుడు, హెచ్‌ఎం శ్రీధర్, జనసేన నాయకులు చదరం నాగేశ్వరరావు, గంగుపాము జగదీష్, స్థానిక వ్యాపారవేత్త అంజనీ చౌదరి, ఎంపిటిసి అప్పలనాయుడు, టిడిపి నాయకులు చెక్కల శ్రీను, సైనిక్, ఉప్పులూరి అప్పలనాయుడు, ఆళ్ల శ్రీను, ఉపాధ్యాయులు బాబు, గొంది చిన్నబ్బాయ్, వసంతరావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు అందజేత

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండల కేంద్రంలోని వినయ్ విద్యా సంస్థ విద్యార్థులకు ఊపిరి ఫౌండేషన్ వారు క్రీడా పరికరాలను శనివారం అందించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థ కరస్పాండెంట్ బత్తుల వాసు మాట్లాడుతూ విద్యార్థులు ఆటపట్ల ఆసక్తి పెంచుకుకోవాలని సూచించారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల, వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్స్‌ను శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని మంచి మార్కులతో, స్కాలర్‌షిప్‌లను పొందాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సురేష్, వెంకటరావు, ట్రస్ట్ సభ్యులు రెడ్డి శేషగిరిరావు, వెంకటరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మెటీరియల్ అందజేస్తున్న అమ్మ ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టిన ప్రిన్సిపల్

స్కూల్ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన



సాయిశక్తి పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : పట్టణంలోని గాంధీ నగరంలో సాయిశక్తి ప్రైవేట్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులను ప్రిన్సిపల్ విచక్షణారహితంగా చితకబాదడంతో తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. స్కూల్ ఎదుట నినాదాలతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐరన్ స్కేల్‌తో తమ పిల్లలను చితకబాదారని, ఒంటిపై గాయాలు మాదిరి తట్లు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు అల్లరి చేస్తే సర్ది చెప్పాలి, లేకుంటే తల్లిదండ్రులకు చెప్పాలని, ఇలా కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. విషయం తెలియగానే విద్యార్థి సంఘాల నేతలు తల్లిదండ్రులకు అండగా నిలిచారు. దీనిపై ఫిర్యాదు అందగానే అనకాపల్లి డిఈఓ అప్పారావునాయుడు స్కూల్‌కి చేరుకొని విచారణ చేపట్టారు. మరింత విచారణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిపై పాఠశాల యాజమాన్యం స్పందించకపోగా రాజకీయ నాయకుల సపోర్టు కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇలాంటి ఘటనలపై బాధ్యులకు అండగా నిలిచే ఓ నాయకుడి దగ్గరికి వెళ్లినట్లు సమాచారం. మరి ఆ నాయకుడితో విద్యాశాఖ అధికారులను మేనేజ్ చేస్తారా? లేక ఈ ఘటనతో విద్యాశాఖ మేలుకుంటుందా చూడాల్సిందే అంటూ ప్రజాసంఘ నాయకులు చెబుతున్నారు.

పి4 సంధానకర్తలుగా పనిచేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు పి4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలకు, మార్గదర్శులకు సంధానకర్తలుగా పనిచేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ సూచించారు. స్థానిక ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో పేదరికం లేని సమాజం పి4 కార్యక్రమంపై శనివారం గ్రామ వార్డు సచివాలయ సిబ్బందికి నిర్వహించిన ఒకరోజు శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టరు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పి4 విజయవంతం చేయడంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులదే కీలక పాత్ర అని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా పి4 కార్యక్రమానికి అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించి, వారిని మార్గదర్శులతో మ్యాపింగు చేయాలన్నారు. పి4కార్యక్రమానికి అర్హత కలిగి మిగిలిపోయిన కుటుంబాలను, కొత్త మార్గదర్శులను నమోదు చేయాలని, అర్హత, ఆశక్తి లేని మార్గదర్శులను ఈ కార్యక్రమం నుండి తప్పించాలని సూచించారు. బంగారు కుటుంబ అవసరాలను ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మార్గదర్శులు కలిసి నెరవేర్చే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని బంగారు కుటుంబాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి జి. రామారావు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టరు విజయకృష్ణన్

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై నిరాహార దీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపి విద్యుత్ ఉద్యోగుల జేఏసీ పిలుపుమేరకు విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రెండవ రోజు శనివారం అనకాపల్లి విద్యుత్తు సర్కిల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేశారు. వీరికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా యుఈఈ యూనియన్ డివిజన్ సెక్రటరీ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ఉద్యోగులు కార్మికులు సాధించుకున్న హక్కులకు నష్టం కలిగేలా యజమాన్యాల నిర్ణయాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు ఉన్న హక్కులు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నారని వారిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. పిఆర్సి బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎనర్జీ అసిస్టెంట్లు (గ్రేడ్- 2 జేఎల్ఎం) జూనియర్ లైన్మెన్లు సర్వీస్‌లో చేరి ఆరు సంవత్సరాలు గడుస్తున్న ఇంకా వారు తాత్కాలిక ఉద్యోగులుగానే మిగిలిపోయారని, వారికి ప్రొబిషన్ డిక్లేర్ చేసి సర్వీసు రెగ్యులేషన్స్ వర్తింపజేసి వారికి వెంటనే అసిస్టెంట్ లైన్మెన్‌గా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పి చంద్రశేఖర్, దారా అప్పారావు, రవికుమార్, సిహెచ్ బుచ్చిబాబు,కే మాధవి, అనంతలక్ష్మి, సత్యవేణి పాల్గొన్నారు.

పిఎసిఎస్‌ల ద్వారా రైతులకు నేరుగా రుణాలు

ప్రజాశక్తి-సబ్బవరం : పిఎసిఎస్ ద్వారా రైతులకు నేరుగా రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు డిసిసిబి ఛైర్మన్ కోన తాతారావు అన్నారు. స్థానిక దుర్గాంబ పిఎసిఎస్‌లో శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సబ్బవరం పిఎసిఎస్ దానికున్న ఆస్తులు వల్ల లాభాల్లో ఉందని, పిఎసిఎస్ కార్యకలాపాలతో లాభాల బాటలో లేదని పేర్కొన్నారు. రైతులకు క్రాప్‌లో కింద ఎకరాకు రూ.54 వేలు ప్రస్తుతం ఉందని, ఇది రైతులకు చాలదని, క్రాప్‌లోను ఈసారి కిసాన్ మిత్ర ద్వారా ఆరు లక్షలు, ఎకరాకు రైతుకు నాలుగు లక్షలు కలిసి 10 లక్షలు రుణం అందించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కోన తాతారావును పిఎసిఎస్ ఛైర్మన్ గండి దేముడు, డైరెక్టర్లు సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి సిఈఓ డివిసి వర్మ, డైరెక్టర్లు బొబ్బరి కన్నారావు, పల్లా తాతారావు, టిడిపి మండల అధ్యక్షులు గండి ముత్యాల నాయుడు, నాయకులు బొండా సత్యారావు, భరణికాన సాయినాథరావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డులో ఆటో బోల్తా

ప్రజాశక్తి-వడ్డాది : రోడ్డుపై గుంతల కారణంగా అదుపుతప్పి కూరగాయల ఆటో బోల్తా పడిన సంఘటన బుచ్చయ్యపేట మండలం బంగారమెట్ట గ్రామంలో చోటుచేసుకుంది. ఘాటీ రోడ్డుకి చెందిన కూరగాయల ఆటో అనకాపల్లి మార్కెట్ నుండి కూరగాయలు, ఫ్రూట్స్ ఖరీదు చేసుకొని బుచ్చయ్యపేట మీదగా ఘాటీరోడ్డుకు వెళ్తుండగా, బంగారు మెట్ట మరి చెట్టు జంక్షన్ పోలిపల్లి అమ్మ గుడి సమీపన రోడ్డుపై పెద్దగా గుంతలు ఏర్పడటంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, కూరగాయలన్నీ పక్కనే ఉన్న చెట్టు పొదల్లోకి వెళ్లిపోయాయి. స్థానికులు ఆటోని పైకి లేపారు. ఉన్నతాఅధికారులు స్పందించి రోడ్డుపై గుంతలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సాగునీటి కాలువల అభివృద్ధికి రూ.50 లక్షలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : రైవాడ ప్రాజెక్ట్ పరిధిలోని 10 సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో కాలువలు అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి కృషితో ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు రైవాడ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ పోతల పాత్రు నాయుడు తెలిపారు. స్థానిక రైవాడ అతిథి గృహంలో శనివారం సాగునీటి సంఘాల అధ్యక్షులతో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో 27 పనులు గుర్తించి వాటి పనులు త్వరలో చేపట్టనున్నమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జలాశయం వైస్ ఛైర్మన్ బొడ్డు రమాదేవి, వివిధ సాగునీటి సంఘాల అధ్యక్షులు సిమ్మి నాయుడు, రెడ్డి కొండబాబు, గుల్లిపల్లి మురళి, కొమర బాబురావు, చల్లా తాతీయ్యలు తదితరులు పాల్గొన్నారు.

25న రణభేరిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పాయకరావుపేట : ఉపాధ్యాయులకు భోధనేతర పనులు తగ్గించాలని, 12వ పిఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఉద్యోగులకు 29శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ ఉన్న డిఎ బకాయిలను చెల్లించాలని కోరుతూ ఈ నెల 25న గుంటూరులో జరుగు రాష్ట్ర రణభేరీని జయప్రదం చేయాలని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల బకాయిల చెల్లింపులకు రూట్ మ్యాప్ ప్రకటించాలని, రిటైరైన ఉద్యోగులకు గ్రాట్యూటీ, ఇఎల్ఎన్ క్యాష్ మెంట్ తదితర బాకాయిలు చెల్లించాలని, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి జెవిఎన్‌పి.రాజేష్, నాయకులు బివివి.రమణ, కట్టా శ్రీరామచంద్రమూర్తి, కట్టా శ్రీను, కోడి నానాజీ, డి.ఐజక్, గర్లంక సతీష్, కేఎస్ఆర్.రాజు, ఫణికుమార్, కట్టా లోవరాజు, వెలగా సూరిబాబు, కేవివి.రామారావు, ఎమ్.రామలక్ష్మి, నాగరాజు, జి.వాసు, డిజిఎన్‌జి.ప్రసూనాంబ, శివగణేష్, ఎస్.చంటి, సిహెచ్.వరప్రసాద్, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని తిమ్మాపురం, పెద్దగుమ్ములూరు గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ పనులను డిప్యూటీ ఎంపీడీవో బంగారు సత్యనారాయణ శనివారం ఉదయం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులకు మెరుగైన పారిశుధ్య నిర్వహణ కొరకు పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ పాల్గొన్నారు.

సొంత నిధులతో గుంతల పూడ్చివేత

ప్రజాశక్తి-వడ్డాది : బిఎన్ రోడ్డులో గుంతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో టిడిపి వడ్డాది టౌన్ అధ్యక్షుడు దొండ నరేష్ తన సొంత నిధులతో బంగారమెట్ట జంక్షన్ వద్ద ఉన్న గోతులను శనివారం పూడ్చి వేశాడు. తన సొంత నిధులతో కాంక్రీట్ బుగ్గి వేయించి జెసిబిలతో చదును చేయించాడు. దీంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేశారు

వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం భాగంగా ఎపి గ్రామీణ బ్యాంక్ కె.కోటపాడు బ్రాంచ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్న స్కూల్ విద్యార్థులకు శనివారం వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మావూరి సంతోష్ కుమార్, అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ తరుణ్, క్యాషియర్ ఝాన్సీ, సంస్థ డైరెక్టర్ నూర్జహాన్ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ గేమ్‌కు కిశోర్ ఎంపిక

ప్రజాశక్తి-కశింకోట : రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ గేమ్ అండర్-14కు ఉమ్మడి విశాఖ జిల్లా నుండి మండలంలోని వెదురుపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి వైట్ కిశోర్ ఎంపికయ్యాడు. అనకాపల్లి మండలం మార్టూరు హైస్కూల్‌లో ఈ 19న జరిగిన ఎస్‌జిఎఫ్ ఫెన్సింగ్ గేమ్ అండర్-14 ఎంపిక పోటీల్లో కిశోర్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కెఆర్‌ఎస్ఎన్.నాయుడు తెలిపారు. ఈ మేరకు కిశోర్‌ను శనివారం పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సబిత, పాఠశాల ఛైర్మన్ జి శివ, గ్రామ పెద్దలు అభినందించారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : ఆయుర్వేద వైద్యంపై అవగాహన కలిగి ఉండాలని అవంతి కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు అన్నారు. మాకవరపాలెం మండలంలోని అవంతి కళాశాలలో ఆయుర్వేద వైద్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ లావణ్య మాట్లాడుతూ రోగికి సరైన రీతిలో వైద్యం అందించడం ద్వారా మానసిక శారీరక వ్యాధినైనా ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్యం అందించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏవో డానియల్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎంఎల్‌సిసి

ప్రజాశక్తి-కోటవురట్ల : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మండల లెవల్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ తిరుమల బాబు తెలిపారు. శనివారం కార్యాలయంలో పీకే పల్లి, రాజుపేట, తంగేడు, జల్లూరు, గ్రామాల నుండి 7 సమస్యల పరిష్కారానికి ప్రయత్నించగా ఐదు కేసులకు సంబంధించిన వారు మాత్రమే హాజరయ్యారని తెలిపారు. వీటిలో జల్లూరు సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, స్థానిక ఎస్సై రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గుండాట శిబిరంపై పోలీసుల దాడి

టిడిపి నేత సత్తిబాబు అరెస్టు



టిడిపి నేత సత్తిబాబు

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని ఈదటం గ్రామానికి చెందిన టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు నేమాల సత్యనారాయణ (సత్తిబాబు)ను యాంటీ గేమింగ్ యాక్ట్ కేసులో అరెస్ట్ చేసినట్లు సిఐ గంట్లాన అప్పన్న తెలిపారు. సత్తిబాబు గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో అర్ధరాత్రి సమయంలో గుండాట (నెంబరు గుండు) ఆడిస్తున్నాడని అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలసి గుండాట శిబిరంపై దాడి చేశామన్నారు. సంఘటన స్థలంలో రూ.89 వేలు నగదు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. సత్తిబాబుకు 41 నోటీసు ఇచ్చి యాంటీ గేమింగ్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని పేర్కొన్నారు.

నిందితుడు సత్తిబాబుపై గతంలోనూ కేసులు

నిందితుడు సత్తిబాబు అధికార తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కావడంతో ఈ విషయం బయటకు పొక్కకుండా పోలీసులు గోప్యత పాటించారు. దీంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేమాల సత్తిబాబు గ్రామంలో పలు రకాల అసాంఘిక కార్యక్రమాలకు తెరతీశాడని, ప్రతీరోజూ అర్ధరాత్రి సమయంలో గ్రామానికి సమీపంలోని శ్రీపంపోతమ్మ తల్లి ఆలయం ఎదురుగా ఉన్న కోమటి చెరువు పరిసర వ్యవసాయ పొలాల్లో గుండాట దగ్గరుండి ఆడిస్తూ నిర్వాహకుల వద్ద లక్షల రూపాయలు వసూళ్లు చేస్తున్నాడని గ్రామస్తులు చెప్పారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, పాయకరావుపేట సిఐ అప్పన్నతో మాట్లాడి గుండాటకు పర్మిషన్ తెచ్చానని, ప్రతీరోజూ పెద్దలకు మామూళ్లు ఇస్తున్నానని నమ్మించి నిర్వాహకుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నాడని స్థానికులు తెలిపారు. కాకినాడ జిల్లా, తొండంగి మండలం, పెరుమాళ్ళపురం గ్రామానికి చెందిన కొయ్యా వెంకటస్వామితో కలసి ఈ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. గ్రామంలో మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడుతూ లక్షలు ఆర్జిస్తున్నాడని చెప్పారు. గతంలో జరిగిన ఒక సంఘటనలో పోలీసులు సత్తిబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలుకు పంపారని గుర్తు చేశారు. పాయకరావుపేట పోలీసు స్టేషన్లో నేమాల సత్తిబాబుపై ఇప్పటికే పలు కేసులు నమోదై ఉన్నాయని చెబుతున్నారు. అసాంఘిక కార్యక్రమాలను నిర్వహిస్తోన్న నేమాల సత్తిబాబుపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. అధికార టిడిపి నాయకులు తక్షణమే స్పందించి సత్తిబాబును వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



కోటవురట్ల మండలం బికె.పల్లిలో మొక్క నాటుతున్న టిడిపి నేత లింగన్ననాయుడు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం : హరిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అనకాపల్లి మండలం గొలగాం గ్రామ పంచాయతీలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం పరిసరాలలో కలెక్టర్ మొక్కలు నాటారు. అలాగే జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కూడా జిల్లా కలెక్టరు విజయ కష్ణన్ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిఆర్ఒ వై.సత్యనారాయణరావు, డిపిఒ సందీప్, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు. కోటవురట్ల మండలంలోని బికె.పల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రఘురాం ఆధ్వర్యంలో మండల టిడిపి అధ్యక్షులు లింగన్న నాయుడు మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహశీల్దారు తిరుమల బాబు, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు. చోడవరంలోని గాంధీ పార్కు వద్ద స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీదేవి, ఎంపీడీవో ఆంజనేయులు, పంచాయతీ ఈవో కే శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి అర్జున్‌రావు, ఎంపీపీ గాడి కాసు సర్పంచ్ బండి నూకాలమ్మ పాల్గొన్నారు.

విశాఖ జిల్లాలో...

స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా భీమిలి మండలం సింగనబంద పంచాయతీలో ర్యాలీ నిర్వహించారు. భీమిలి బీచ్‌లో పోస్టర్ సిబ్బంది ర్యాలీ చేశారు. తగరపువలస డిగ్రీ కాలేజీలో మొక్కలు నాటారు. పద్మనాభం మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో, రేవిడి పిహెచ్‌సిలో చెత్తను తొలగించి మొక్కలు నాటారు. జోడుగుళ్లపాలెం బీచ్‌లో జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ ఆధ్వర్యాన స్వచ్ఛాంధ్ర , స్వర్ణాంధ్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మి చౌదరి, జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి పాల్గొన్నారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఎపిఇపిడిసిఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కింజరాపు వెంకట రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యాన సర్కిల్ ఆఫీస్ పరిసరాలలో మొక్కలు నాటారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

24న చలో అసెంబ్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-దేవరాపల్లి : అభివృద్ధి ముసుగులో 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పోలీసులు, సైన్యాన్ని ఉపయోగించి రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కోవడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 24న జరుగు చలో అసెంబ్లీ కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గతంలో పరవాడలో ఫార్మాసిటీ కోసం 3064 ఎకరాలు, అచ్యుతాపురంలో ఎస్ఇజెడ్ కోసం 9,174 ఎకరాలు, రాంబిల్లి, ఎస్.రాయవరంలో ఎన్ఎఒబి కోసం 5,300 ఎకరాలు, మునగపాకలో లాజిస్టిక్ హబ్ కోసం 374 ఎకరాలు, సబ్బవరంలో లా, మారిటైమ్, పెట్రోలియం యూనివర్సిటీల కోసం 372 ఎకరాలు రైతుల నుండి తీసుకున్నారని గుర్తు చేశారు. ఈ భూముల్లో వేలాది ఎకరాలు ఇంకా ఖాళీగా ఉన్నాయని, ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించలేదని, నిర్వాసితుల పునరావాస కాలనీల్లో నేటికీ మౌళిక సదుపాయాలు కల్పించలేదని పేర్కొన్నారు. ఈ భూములు చాలవన్నట్లు నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్, మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం 4,500 ఎకరాలు, దేవరాపల్లి చింతలపూడి పరివాహక ప్రాంతంలో అదాని హైడ్రో పంపుడు స్టోరేజ్ పవర్ ప్లాంట్ కోసం 820 ఎకరాలు, ఎస్ఇజెడ్‌ల కోసం కె.కోటపాడులో 1200 ఎకరాలు, బుచ్చయ్యపేటలో 1691 ఎకరాల భూములను బలవంతంగా సేకరించడానికి ప్రభుత్వం సిద్ధమైందని పేర్కొన్నారు. బలవంతపు భూసేకరణ జరుగుతున్న ప్రాంతాల నుండి రైతులు, కూలీలు చలో అసెంబ్లీకి తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, నాయకులు, ప్రజలు

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగించుకోవాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నాయుడు అన్నారు. మండలంలోని సుంకపూరు సచివాలయం వద్ద పీహెచ్సీ సిబ్బంది నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ వ్యాధులపై ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మి, జనసేన మండల అధ్యక్షుడు శ్రీనివాస్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అక్కినేని 102వ జయంతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ సినీ నటులు అక్కినేని నాగేశ్వరరావు 102వ జయంతి కార్యక్రమం సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేద వృద్ధులకు వస్త్రదానం చేశారు. స్థానిక చినరాజుపేట శ్రీసాంబశివ దేవాలయం వద్ద ఏఎన్ఆర్ చిత్రపటానికి పూల మాలవేసి ఘన నివాళి లర్పించారు. సాంబ శివ దేవాలయ అర్చకులు నందన్ శర్మ చేతుల మీదుగా దుస్తులు, చీరలు, కళ్ళ జోళ్ళు స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు అయ్యగారి వెంకటరమణ మూర్తి, బొడ్డు సోమరాజు, వి.ఉమాశంకర్, స్థానికులు పాల్గొన్నారు.

సొంత నిధులతో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట సత్తెమ్మ కాలనీకి చెందిన కూటమి నాయకులు బీశెట్టి నారాయణరావు, ఏదూరి రమణలు తమ సొంత నిధులు ఖర్చు చేసి జేసీబీతో తుప్పలను శనివారం తొలిగించారు. ఇక్కడ సత్యనగర్ కాలనీలో ఎప్పటినుంచో రోడ్డు మొత్తం తుప్పలతో ఉంది. రకరకాల పురుగులు, విషసర్పాలు రావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో నారాయణరావు, రమణ ఈ తుప్పలను తొలగించే చర్యలు చేపట్టారు.

పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని పెదముషిడివాడ జెడ్‌పి హైస్కూల్‌లో పరవాడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం పలు అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన పరిణామాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ సూత్రాలు తెలియజేశారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినప్పుడు వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శక్తి యాప్ ఉపయోగం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సిఐ ఆర్.మల్లికార్జునరావు, పాఠశాల హెచ్‌ఎం కె.కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోరుబావికి మరమ్మతులు చేయండి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామ శశ్మనా వాటికలో మంచి నీటిబోరు కొంతకాలంగా పాడైపోయి ఉందని, దానికి మరమ్మతులు చేయించాలని గ్రామ వార్డు సభ్యులు ఆకుల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా చనిపోయినప్పుడు శ్మశానంలో సంప్రదాయ బద్ధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమీపంలోని పశువుల కల్లాల రైతులు కూడా దీనిని వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

రైతులు డ్రోన్ విప్లవాన్ని అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-యలమంచిలి : రైతులు డ్రోన్ విప్లవాన్ని అందిపుచ్చుకోవాలని మండల వ్యవసాధాకారి పొలిమేర మోహనరావు అన్నారు. మండలంలోని జంపపాలెం గ్రామంలో డ్రోన్ పైలెట్ మణికంఠ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా నానో యూరియా ఎరువు ద్రావణాన్ని శనివారం పిచికారీ చేశారు. రైతులు కర్రి రమణ, యల్లపు రమణారావు, యల్లపు కోటిలకు చెందిన నాలుగున్నర ఎకరాల్లో డ్రోన్ స్ప్రే ప్రయోగాత్మకంగా జరిగింది. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో విద్యార్థుల జీవితాలు నాశనం

-ఉత్తరప్రదేశ్ అదనపు డిజిపి సత్యనారాయణ్



ప్రతిజ్ఞ చేయిస్తున్న యుపి అదనపు డిజిపి, డిఐజి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్ణయించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని ఉత్తర ప్రదేశ్ అదనపు డీజీపీ కిల్లాడ సత్యనారాయణ్ విద్యార్థులకు తెలియజేశారు. శనివారం నర్సీపట్నం స్టార్ హెూమ్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థులతో చర్చ గోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మాదక ద్రవ్యాల ప్రభావానికి లోనుకాకుండా, తమ భవిష్యత్తును సక్రమంగా నిర్మించుకోవాలని సూచించారు. వృత్తి ప్రణాళిక, క్రమశిక్షణ, కష్టపడి పనిచేయడం విజయానికి కీలకమని తెలిపారు.

డిఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ , యువతను మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా చేయడమే సంకల్పం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఐదు జిల్లాల్లో మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు విస్తృత చర్యలు చేపడుతున్నారని చెప్పారు.సోషల్ మీడియాలో నిర్ధారణ లేకుండా సందేశాలు షేర్ చేయడం నేరమని హెచ్చరించారు.

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం అవుతుందని వివరించారు. ఒకసారి డ్రగ్స్ అలవాటు పడితే బానిసత్వానికి దారితీస్తుందని చెప్పారు. అలవాటు బారిన పడిన వారు సంకోచం లేకుండా డీ-అడిక్షన్ సెంటర్లలో చికిత్స పొందాలని సూచించారు.

నర్సీపట్నం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఎల్.పరమేశ్వరి మాట్లాడుతూ యువత డ్రగ్స్ ప్రభావంతో తమ భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు గోవిందరావు, రేవతమ్మ, ఎస్ఐలు ధనుంజయ నాయుడు, ఉమామహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



నక్కపల్లిలో నిరసన చేపడుతున్న దస్తావేజు లేఖర్లు

ప్రజాశక్తి-చోడవరం : ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా తీసుకువచ్చిన రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా దస్తావేజు లేఖర్లు రెండో రోజు శనివారం కూడా పెన్‌డౌన్ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వడ్డాది రమేష్ మాట్లాడుతూ ఈ నూతన విధానంలో ఓటిపిల వల్ల, డాక్యుమెంట్ సబ్మిట్ చేసిన తరువాత ఎడిట్ ఆప్షన్ లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సంఘం నాయకులు సీతారామయ్య, బొబ్బిలి చంద్రశేఖర్, శ్రీనివాసరావు. రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు నిరసన తెలిపారు. సంఘం నాయకులు అయోధ్య శేషు, ఆనంద్, ప్రసాద్, వెంకట గున్నాజీరావు, కొండలరావు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని శ్రీదుర్గమాంబ దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యాన పెన్‌డౌన్ కొనసాగింది. సంఘం నాయకులు శేఖర్‌మంత్రి శ్రీనివాసరావు, వివిఎస్ఆర్.మూర్తి, జెవిఎస్ఆర్ మూర్తి, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు రెండు రోజు పెన్‌డౌన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శెలంశెట్టి నాగేష్, పిల్లా నాగేశ్వరరావు, సూర్యప్రకాశ్, పి.సురేష్, రావి నూకరాజు పాల్గొన్నారు.

నక్కపల్లి:రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా తీసుకొచ్చిన రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు చేయాలని దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు దాతారం మురళీకృష్ణ డిమాండ్ చేశారు. నక్కపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్ నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు శ్రీనివాస్, పి.లోవ రత్నం, వెంకటరమణ, కూరపాటి సూర్యనారాయణ. రాంబాబు చౌదరి, గుతకాల నూకరాజు, బి.రాజు, వరహాలు, రేఖ వాసు, అనంత్, కుమార్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : రిజిస్ట్రేషన్ శాఖలో నూతన విధానాలను వ్యతిరేకిస్తూ దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్ కార్యక్రమం రెండో రోజు శనివారమూ కొనసాగింది. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు బి.లక్ష్మి, సాయి శ్రీనివాస్, భాను ప్రకాష్, అడిదం కిషోర్ పాల్గొన్నారు.

గొలుగొండ మండలంలో విలీనం చేయాలి

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ :అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం కంఠారం, బాలారం గ్రామాలను అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలో విలీనం చేయాలని కంఠారం, బాలారం గ్రామస్థులు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక కళ్యాణ మండపంలో జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ 1886 పూర్వం నుండి తాము గొలుగొండ తాలుకాలోనే ఉండేవారమన్నారు. 1959లో నర్సీపట్నం తాలుకాలో పెట్టారన్నారు. 1979లో చింతపల్లి తాలుకాలో చేర్చారని, అనంతరం కొయ్యూరు మండలంలో విలీనం చేశారని చెప్పారు. అప్పటి నుండి తాము జిల్లా కేంద్రంలో పనుల కొరకు అనేక వ్యయప్రయాసాలకు గురి కావాల్సి వస్తుందని వాపోయారు. మా గ్రామం నుండి కొయ్యూరు వెళ్లటకు గొలుగొండ మండలం మీదుగా 39 కిలో మీటర్లు దూరం ప్రయాణం చేసి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ గ్రామం గొలుగొండ మండల సరిహద్దులో ఉందని, గొలుగొండ మండల కేంద్రం కేవలం 13కిలో మీటర్లు, నర్సీపట్నంకు కేవలం 29 కిలో మీటర్లు దూరంలో ఉన్నాయన్నారు. అనకాపల్లికి 69కిలో మీటర్లు, పాడేరు జిల్లా కేంద్రానికి 125కిలో మీటర్లు దూరంలో ఉన్నాయన్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలలో పనులకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. కొయ్యూరు మండలం ఆడాకుల, ఆర్.కొత్తూరు గ్రామాలను సమీపంలో నాతవరం మండలంలో విలీనం చేయాలని ఆడాకుల, ఆర్. కొత్తూరు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు మాజీ జెడ్పీటీసీ గాడి శ్రీరామ్మూర్తి, మాజీ వైస్ ఎంపిపి కూనిశెట్టి చినతాతయ్య, మంత్రి ప్రగడ రమణమూర్తి, సుర్ల రమణ, రొంగల గోవింద పాల్గొన్నారు.



అభినందిస్తున్న సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి

ఎంపిడిఒకు సత్కారం

ప్రజాశక్తి- రావికమతం:నూతన మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేష్‌ను మేడివాడ కోపరేటివ్ సొసైటీ పర్సన్ ఇంచార్జ్ గూటాల చిన్న, గల్లా రాజేశ్వరరావు, దంట్ల సత్యనారాయణలు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా గూటాల చిన్న మాట్లాడుతూ, రావికమతం మండలాన్ని అభివృద్ధి పదంలో నడిపించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో కృషి చేయాలన్నారు.



టీకాలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి

పశువులకు టీకాలు

ప్రజాశక్తి - చీడికాడ:పశువులకు గాలి కుంటూ వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని ఖండివరం పశు వైద్యాధికారి గణేశ్వర్ రెడ్డి తెలిపారు. మండలం అప్పలరాజుపురంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడి రైతులు నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకి గాలికుంటు నిరోధక టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు మోర్తా శ్రీనివాసరావు, లలితా దేవి వృద్ధాశ్రమ నిర్వాహకురాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగ్గా బోధించాలి



అవగాహన కల్పిస్తున్న చైర్మన్ బాలాజీ

ప్రజాశక్తి -నక్కపల్లి:శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాల మేరకు విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేయాలని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వి బాలాజీ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలో శనివారం నక్కపల్లి, వేంపాడు, చినదొడ్డిగల్లు, గొడిచర్ల హైస్కూల్ కేంద్రాలుగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. చినదొడ్డిగల్లు హైస్కూల్‌లో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో కాంప్లెక్స్ చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ, ప్రతీ విద్యార్థీ పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని, ఏ తరగతిలో ఎంతమంది ఏఏ గ్రేడులలో ఉన్నారో,వారికి అందిస్తున్న శిక్షణ తో ఉపాధ్యాయులు విధిగా రికార్డు నమోదుచేయాలన్నారు.ఈ ఏడాది పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న మార్పులపై అవగాహన కలిగి ఉండాలన్నారు.విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇటీవల విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ను ప్రతీ ఉపాధ్యాయులు పరిశీలించాలన్నారు. వ్రాత పూర్వమైన అంశాలను విద్యార్థులకు విరివిగా ఇచ్చి దోషాలను సవరించాలన్నారు. పాఠశాల గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు.

చినదొడ్డిగల్లు హైస్కూల్ లో నిర్వహించిన ఈ తరగతులను మండలవిద్యాశాఖాధికారి2 రుత్తల నాగన్నదొర పరిశీలించి పలు సూచనలు,సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్.జయశ్రీ, చినతల్లి , సి.ఆర్.పీ లు శేఖర్, అప్పారావు, జ్యోతి, దేవి, గంగేశ్వరరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ముందు జాగ్రత్తలతో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి -నక్కపల్లి:వరిలో ముందు జాగ్రత్తలతో తెగుళు రాకుండా నివారించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండలంలో శనివారం జి.జగన్నాధపురం, దోసలపాడు, దొండాడ గ్రామాలలో వరి పొలాలను వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుద్ర, సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ సందర్శించారు. వరి పొలాలను పరిశీలించారు. మిత్ర పురుగులైన తూనీగలు, సాలెపురుగులు తగినంత ఉండటంతో ప్రస్తుత రసాయన మందుల వాడకం అవసరం లేదని రైతులకు సూచించారు. ముందు జాగ్రత్తగా ఎకరాకు ఒక కిలో సూడోమోనాస్ పిచికారి చేసుకోవడంతో పాము పొడ, అగ్గి తెగుళ్ల వంటి వాటిని రాకుండా నివారించవచ్చునని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి సత్యనారాయణ, కృషి విజ్ఞాన కేంద్రం – పశు వైద్యులు డాక్టర్ విజయర్హా, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న బుజ్జి

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో చినదొడ్డిగల్లు గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దార్ నరసింహమూర్తి పంపిణీ చేశారు. ఉపమాకలో నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి కూటమి నాయకులతో కలిసి కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, రేషన్ డీలర్లు కొప్పిశెట్టి హరి, నన్ను గుప్తా, పలువురు నాయకులు పాల్గొన్నారు. గొడిచెర్లలో మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, స్థానిక కూటమి నాయకులతో కార్డులను పంపిణీ చేసారు.



ప్రారంభిస్తున్న చైర్మన్, అధికారులు

నిమ్మకట్టు ఛానల్ గేట్లు ప్రారంభం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నాతవరం మండల లంలో రాజుపేట అగ్రహారం నిమ్మకట్టు ఛానల్ వద్ద పాడైన గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేసి శనివారం తాండవ ప్రాజెక్టు చైర్మన్ కరక సత్యనారాయణ, తాండవ డీఈ అనురాధ ప్రారంభించారు.ఈ సందర్భంగా కరక సత్యనారాయణ మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చోట్ల గేట్లు దెబ్బతిన్నాయని, స్పీకర్ అయ్యన్న నాయకత్వంలో మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. చివరి భూములకు కూడా నీరు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు అప్పన దివాణం, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వెలగా కృష్ణారావు, వైస్ చైర్మన్ మేడపరెడ్డి జోగుబాబు, ఏ.ఈ శ్యామ్, గన్నవరం పిఎసిఎస్ చైర్పర్సన్ సన్యాస్ దేముడు, స్టేట్ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మరిడయ్య, దాసు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకూ పోరాటం

- మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో నిరసన

ప్రజాశక్తి- నక్కపల్లి:బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మత్స్యకారులు స్పష్టం చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 7వ రోజుకు చేరింది. బల్క్ డ్రగ్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అప్పలరాజు, మత్స్యకారులు మాట్లాడుతూ మత్స్యకారుల ఉపాధి, మనుగడను దెబ్బతీస్తే బల్క్ డ్రగ్ పార్కును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా ఉపాధి కోల్పోయి, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు సముద్రతీరాన్ని డంపింగ్ యార్డ్ గా మార్చి మత్స్యకారుల జీవితాలను నాశనం చేస్తున్నారని తెలిపారు. జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు మత్స్యకారులకు సంఘీభావం తెలిపి, రిలే దీక్షల్లో పాల్గొన్నారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మోసం చేశారని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టొద్దన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, మత్స్యకార నాయకులు ఎరిపిల్లి నాగేశ్వరరావు (నాగేష్), మైలపల్లి మహేష్ బాబు, పి.తాతీలు, జి.సోమేశ్వరరావు, ఎం.మహేష్ బాబు, డి.నానాజీ, గుర్రన్న, బుజ్జి, చేపల సోమేష్, బాపూజీ తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు, మత్స్యకారులు


నినాదాలు చేస్తున్న దళిత రైతులు

60వ రోజుకు దళిత రైతుల దీక్ష

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మాకవరపాలెం మండలం జి.కోడూరులో క్వారీని రద్దు చేయాలని నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద దళిత రైతులు చేపట్టిన రిలే దీక్ష శనివారం 60వ రోజుకు చేరింది. అధికారులు కనీసం స్పందించకపోవడంతో దళితులు ఆవేదన వ్యక్తం చేశారు.'ఈ క్వారీలో స్పీకర్ బినామీలు ఉన్నారని, దీంతోనే అధికారులు 60 రోజులుగా తమ దీక్షను పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు చిరంజీవి, ఏబిఎస్పి నాయకులు బుట్టా నాగరాజు, రైతులు అప్పారావు, పెంటయ్య, నాగభూషణం, చిరంజీవి, లక్ష్మి పాల్గొన్నారు


సమావేశానికి హాజరు కాని అధికారులు

మొక్కుబడిగా ఎంఎల్‌సిసి

ప్రజాశక్తి -నర్సీపట్నం:రెవెన్యూ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయి అధికారులు ప్రవేశపెట్టిన మండల లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ (ఎంఎల్‌సిసి) మొక్కుబడి తంతుగానే నిర్వహిస్తున్నారు.. ప్రతి శనివారం రెవెన్యూ సమస్యల పరిష్కారానికై ప్రవేశపెట్టిన ఎంలెసి కమిటీ సాధ్యమైనంత మేర సమస్యలు పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తారు. శనివారం నిర్వహించిన ఎంలెసి కమిటీకి తహసిల్దారు కోర్టు పనిమీద వెళ్లడంతో ఆయన హాజరు కాలేదు. స్థానిక స్టేషన్ హౌస్ అధికారులు, మండల పరిషత్ అధికారులు ఎవరూ కూడా అందుబాటులో లేక పోవడంతో మండల ప్రత్యేక అధికారిని జయంతి, డిప్యూటీ తహసిల్దారు గణేషి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ధర్మసాగరం, అయ్యన్నపాలెం గ్రామాలకు సంబంధించిన సమస్యలపై కమిటీలో చర్చించినట్లు అధికారులు తెలిపారు.పూర్తిస్థాయిలో అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు హాజరు కాకపోవడంతో ఫిర్యాదుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నారాయణరావు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిన్నప్పన్నపాలెంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: మండలంలోని చిన్నప్పన్న పాలెం గ్రామంలో వీఎస్ఆర్ ట్రస్టు ఛైర్మన్ సత్యారావు ఆధ్వర్యాన ఎన్నారై హాస్పిటల్ వారిచే శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా కంటి పరీక్షలు, గుండె పరీక్షలను, హెచ్‌సిజి హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోవెల ఈశ్వరరావు, సర్పంచ్ మహేష్, కోవెల రమేష్, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి మైత్రి గ్రంథాలయం ఏర్పాటు స్ఫూర్తిదాయకం

-విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్ జెట్టి

ప్రజాశక్తి-గొలుగొండ:పోలీసులు, గ్రామస్తులు కలిపి ఏర్పాటు చేసిన అల్లూరి మైత్రి గ్రంథాలయం పలువురికి స్ఫూర్తిదాయకమని డిఐజి గోపీనాథ్ జెట్టి అన్నారు. మండలంలో ఏ ఎల్.పురం అల్లూరి మైత్రి గ్రంథాలయాన్ని ఆయన శనివారం సాయంత్రం సందర్శించారు. కళాశాల విద్యార్థులు గ్రంథాలయ నిర్వాహకులు పోలీసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రంథాలయం వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి అనకాపల్లి ఎస్పీ తుహిన్‌సిన్హా తో కలిసి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. అనంతరం గ్రంథాలయంలో అదనంగా విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కంప్యూటర్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. హైస్కూల్ విద్యార్థులకు 25 వేల రూపాయలు విలువైన క్రీడా సామాగ్రిని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబడటానికి గ్రంథాలయాలు ప్రతి గ్రామంలోనూ అవసరమన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ పుస్తక పఠనం అనేది ప్రతి ఒక్కరికి అవసరం అన్నారు. గ్రంథాలయంలో పుస్తకాలు చదవడం ద్వారా గ్రామంలో ఎనిమిది మందికి డీఎస్సీలో ఉద్యోగాలు రావడం అభినందించదగిన పరిణామం అని ఆయన కొనియాడారు.అనంతరం గ్రంథాలయ స్థాపనకు కృషి చేసిన విశ్రాంత ఉపాధ్యాయులను, పెద్దలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఆర్జేడి విజయ్ భాస్కర్, పూర్వ సిఐలు సోమశేఖర్, స్వామినాయుడు, నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు, రూరల్ సిఐ రేవతమ్మ, గొలుగొండ ఎస్సై రామారావు, నాతవరం ఎస్సై తారకేశ్వరరావు, స్థానిక సర్పంచ్ లోచల సుజాత, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, గ్రంథాలయ వ్యవస్థాపకులు శర్మ, నిర్వాహకులు సత్యనారాయణ, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


అల్లూరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న డిఐజి

పెట్టుబడిదారులకు లాభాల కోసమే పని గంటల పెంపు

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : పెట్టుబడిదారులకు లాభాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం పని గంటల పెంచిందని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివి.శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో కార్మికుల పనిగంటలను ఎనిమిది నుండి 13 గంటలకు పెంచడంతోపాటు మహిళలకు రాత్రి షిఫ్ట్ డ్యూటీలు వెయ్యొచ్చని ఆమోదించిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం పారిశ్రామికవేత్తల మెప్పుకోసమేనని, కార్మికుల శ్రమని దోచిపెట్టడమేనని విమర్శించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్స్‌ని తీసుకొచ్చిందని, దీనిపై గత ఐదు సంవత్సరాలుగా కార్మికుల పోరాడుతున్నారని, ఈ లేబర్ కోడ్స్‌లో భాగంగానే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికి అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చిందని ఆరోపించారు. అన్ని దేశాల్లో పనిగంటలు తగ్గింపు చేస్తుంటే మనదేశంలో పనిగంటలు పెంపు ద్వారా కార్మికుల శ్రమను పారిశ్రామికవేత్తలకు దోచిపెట్టడానికి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా కార్మిక హక్కుల్ని హరిస్తున్నారని ధ్వజమెత్తారు. దీనిపై కార్మికులందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

అచ్యుతాపురం : ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానాన్ని 13 గంటలకు పెంచడం వెంటనే విరమించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం పని గంటలను పెంచడం కార్మికుల హక్కులను కాలరాయడమేనని చెప్పారు.

సిఐటియు నిరసన

పరవాడ : కార్మికుల పని గంటలు ఎనిమిది నుండి 13 గంటలు పెంచుతూ, రాత్రి సమయంలో మహిళలతో పని చేయించేందుకు శుక్రవారం రాష్ట్ర శాసనసభలో కార్మిక చట్టాలను సవరించడంపై సిఐటియు ఆధ్వర్యాన శనివారం ఫార్మాసిటీలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఫ్యాక్టరీలు చట్టం 1948 సవరణ చేసి సభ ఆమోదం తెలిపిందని, కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం చట్టాలను నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలోకి తొక్కి కార్మికులను మరింత దోపిడీ చేసే విధంగా చట్టాలను సవరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలకుల కంటే ఘోరంగా కార్మికులకు ఉన్న హక్కులను యాజమాన్యాలకు తాకట్టు పెట్టే ప్రయత్నం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వాలు ఈ విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



ఫార్మాసిటీలో నిరసన తెలుపుతున్న కార్మికులు

13 గంటల పని విధానాన్ని వ్యతిరేకించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్మికులకు ప్రకటించిన 13 గంటల పని విధానాన్ని అందరూ వ్యతిరేకించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఐఎల్ఓ 1919లో 8 గంటలే పని గంటలు ఉండాలని, 48 గంటలు వారానికి పనిచేయాలని రికమెండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఫ్యాక్టరీ యాక్ట్ ప్రకారం ఆ విధంగానే పని గంటలు అమలవుతున్నాయని తెలిపారు. తాజాగా చంద్రబాబు కార్మికులకు, ఉద్యోగులకు రోజుకు 13 గంటల పని చేయాలని ఆదేశిస్తున్నారని, రాష్ట్ర శాసనసభ చట్టం కూడా చేసిందని తెలిపారు. బాబు కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలమైన పద్ధతులను అమలు చేస్తామనడం దారుణమన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ప్రజలకు ఆరోగ్యం సాధ్యమని అనకాపల్లి రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్ట్ అధికారి సిహెచ్ లచ్చన్న అన్నారు. అనకాపల్లి జిల్లా ప్రాజెక్టు ఆఫీసులో శనివారం వివిధ మండలాల నుంచి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయుటకు మండలానికి ఒకరు చొప్పున ఎంపిక చేసిన వారికి డిపిఎం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయా మండలాల్లో రైతులు పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మండల కేంద్రాలలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మార్కెటింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ జిల్లా అధికారి వర్మ, జిల్లా కోఆర్డినేటర్ గోవింద్, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సిరసపల్లి అప్పలరాజు, శివ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.